శనివారం
11-06-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 70, సంచిక : 348
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

'ఆహార' బిల్లు.. తడిసి మోపెడు

ప్రపంచ ఆహార దిగుమతి బిల్లు కొత్త రికార్డు సృష్టించబోతోంది. ఈ ఏడాది 1.8 ట్రిలియన్ డాలర్లకు చేరుకోనుంది. పెరిగిపోతున్న ధరలు, రవాణా వ్యయాలతో తడిచి మోపెడవుతోంది. గుప్పెడు గింజల కోసం జేబులు ఖాళీ అవుతున్నాయి.

2 లో

కాషాయ నేతల విద్వేష వ్యాఖ్యలపై

మిన్నంటిన నిరసనలు

- నూపుర్‌శర్మ, నవీన్‌కుమార్ జిందాల్‌ను అరెస్టు చేయాలని డిమాండ్
- భారీ పోలీసు భద్రత

న్యూఢిల్లీ:
మహ్మద్ ప్రవక్తపై బహిష్కృత బీజేపీ నేతలు నుపుర్ శర్మ, నవీన్ జిందాల్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం దేశవ్యాప్తంగా అనేక చోట్ల భారీ ప్రదర్శనలు నిర్వహించారు. శుక్రవారం మసీదుల్లో ప్రార్థనల అనంతరం కాషాయ నేతల విద్వేష వ్యాఖ్యలపై ఆందోళన చేపట్టారు. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, కోల్‌కతా, హైదరాబాద్, జమ్ముకశ్మీరు, కర్ణాటకల్లో నిరసనలు మిన్నంటాయి. రెచ్చగొట్టే ప్రకటనలు చేసిన నూపుర్ శర్మను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ జామా మసీదు వెలుపల నిరసనకు దిగారు. విద్వేష వ్యాఖ్యలు చేసిన నుపుర్ శర్మపై బీజేపీ వేటు వేసిన అనంతరం ఆమె తన వ్యాఖ్యలపై క్షమాపణ కోరినా నిరసనకారులు ఆమె అరెస్ట్‌కు డిమాండ్ చేశారు. నుపుర్ శర్మ దిష్టిబొమ్మలను దహనం చేశారు. నమాజ్ సందర్భంగా కోల్‌కతాలో 300 మందికి పైగా నిరసనకారులు నుపుర్ శర్మను అరెస్ట్ చేయాలని నినదించారు. జామా మసీదు వద్ద నిరసనలకు తాము పిలుపు ఇవ్వలేదని జామా మసీద్ షాహీ ఇమాం తెలిపారు. మరోవైపు యూపీలోని అనేక నగరాల్లో కాషాయ నేతల విద్వేష వ్యాఖ్యలకు నిరసనగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. జామా మసీదు బయట జరిగిన నిరసనలో వందలాదిమంది ముస్లింలు పాల్గొన్నారు. శర్మకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆందోళన చేసిన కొద్ది సేపటి తర్వాత నిరసనకారులు వెళ్లిపోయారని, ఇతరులు ఆందోళన కొనసాగించారని సీనియర్ పోలీసు అధికారి ఒకరు చెప్పారు. దాదాపు అర్ధగంటపాటు ఆందోళన ప్రశాంతంగా కొనసాగిందన్నారు. ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, వివాదాస్పద పూజారి యతి నర్సింగానంద్ సహా 31 మందిపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ముస్లింల మనోభావాలు దెబ్బతీసినందుకుగాను నుపుర్‌శర్మపైనా కేసు నమోదైంది. ఉత్తరప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో ముస్లింలు నిరసన ప్రదర్శనలు చేశారు. సహరాన్‌పూర్, మొరదాబాద్, రాంపూర్, లక్నోలలో ఆందోళనకారులు పెద్దఎత్తున నినాదాలు చేశారని లక్నోలో సీనియర్ పోలీసు అధికారు చెప్పారు. నమాజ్ అనంతరం ప్రయాగ్‌రాజ్‌లోని అటల ప్రాంతంలో ఆందోళనకారులు నినాదాలు చేయడమే కాకుండా రాళ్లదాడి చేసినట్లు వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలోభాగంగా భారీగా పోలీసు బలగాలను మోహరించారు. సీని యర్ పోలీసు, పౌర అధికారులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ప్రయా గ్‌రాజ్‌లో రాళ్లదాడికి సంబంధించిన అంశాన్ని పరిశీలిస్తున్నామని ఏడీజీ

- మిగతా 2 లో

రైతుకు దగా...

- ఎంఎస్‌పీ స్వల్ప పెంపు ప్రోత్సాహకం కాదు
- అన్నదాతలకు మేలు చేయదు
- ద్రవ్యోల్బణం పైనే ప్రభావం చూపుతుంది
- కేంద్రంపై రైతు సంఘాల నేతల ఆగ్రహం

న్యూఢిల్లీ :
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో అన్నదాతల సుదీర్ఘ ఉద్యమాన్ని అణచివేసేందుకు యత్నించిన మోదీ సర్కార్... రైతుల అవిశ్రాంత, అసామాన్య పోరాటానికి తలొంచి వ్యవసాయ రంగంలోని సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చింది. అయితే ఆ హామీలను తుంగలో తొక్కేలా కర్షక వ్యతిరేక చర్యలను కొనసాగిస్తోంది. తాజాగా కేంద్ర మంత్రివర్గం పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పెంపును ఇటీవల ప్రకటించింది. అయితే ఆ పెంపు అంతా బూటకమని, తమకు ఆ ఎంఎస్‌పీ ఏమాత్రం ప్రోత్సాహకరంగా లేదని, అన్నదాతలపై అది ఒక 'క్రూరమైన జోక్' అని రైతు సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం ప్రకటించిన 2022-23 ఖరీఫ్ సీజన్‌కు 14 పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పెంపుదల కేవలం విత్తనాలతో సహా ఇన్‌పుట్‌ల పెరిగిన ధరల ప్రభావాన్ని మాత్రమే కవర్ చేస్తుందని రైతు సంఘాలు గురువారం పేర్కొన్నాయి. భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ప్రకటించిన ద్రవ్యోల్బణం సంఖ్యలతో ఎంఎస్‌పీ పెరుగుదలను పోల్చి చూస్తే దేశ రాజధాని సరిహద్దుల్లో ఏడాదికి పైగా గౌరవప్రదమైన జీవితం కోసం రైతులు నిరసనలు చేసినా వారికి ఎలాంటి ప్రోత్సాహకం లేదని స్పష్టంగా అర్థమవుతోందని ఆ సంస్థలు పేర్కొన్నాయి. ఖరీఫ్ 2022-23కి వరి, మొక్కజొన్న, కందులు, మినుములు, వేరుశెనగకు ఎంఎస్‌పీ కేవలం 7 శాతం, సజ్జలకు కేవలం 8 శాతం మాత్రమే పెరిగిందని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్షుడు అశోక్ ధవాలే తెలిపారు. చాలా పంటలలో పెరుగుదల ఆర్థిక వ్యవస్థలో సాధారణ ద్రవ్యోల్బణంపై మాత్రమే ప్రభావం చూపుతుందని అన్నారు. 'ఇంధనం, ఇతర ఇన్‌పుట్‌ల అధిక ధరలు, భారీ కొరత, ధరల పెరుగుదల కారణంగా రైతులకు ఉత్పత్తి వ్యయం బాగా పెరిగినప్పుడు ఎంఎస్‌పీలో ఈ స్వల్ప పెరుగుదల జరిగిందన్నది గమనార్హం. ఎరువుల సరఫరా. గత సీజన్‌లో కూడా ఎరువుల కొరత కారణంగా బ్లాక్ మార్కెటింగ్ జోరుగా సాగింది. బెలారస్, రష్యాపై అమెరికా, ఈయూ ఆంక్షల కారణంగా ఇటీవలి నెలల్లో పరిస్థితి మరింత దిగజారింది. గోధుమలు, నూనెగింజలు, పప్పు ధాన్యాల ధరల్లో భారీ పెరుగుదలకు దారితీసే పరిణామాలను కూడా ఈ ఎంఎస్‌పీ పెంపు విస్మరిస్తున్నదని రైతు నాయకుడు ఎత్తి చూపారు. భారీ దిగుమతి బిల్లులను నివారించడానికి స్థానిక ఉత్పత్తికి రైతులను ప్రోత్సహించాలని అన్నారు. 'ప్రపంచవ్యాప్తంగా ఆహార వస్తువుల ధరలు చాలా ఎక్కువగా ఉన్న కాలంలో ఇది చేయడం గమనార్హం. దీని అర్థం, భారతదేశం దిగుమతిపై ఆధారపడిన ఆహార నూనెలు, పప్పుల వంటి వస్తువులకు, మన స్వంత రైతులకు చెల్లించడానికి ప్రతిపాదించిన దానికంటే చమురు గింజలు, పప్పులను పండించే

- మిగతా 2 లో

రాజస్థాన్‌లో సత్తాచాటిన కాంగ్రెస్

మూడు సీట్లు కైవసం

8లో

కుప్పకూలిన మార్కెట్లు

1000 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

ముంబై:
ఓవైపు ద్రవ్యోల్బణ భయాలు.. మరోవైపు కరోనా ఉధృతి ఆందోళనలు.. ఆపై అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాలు.. వెరసి దేశీయ మార్కెట్లు శుక్రవారం కుప్పకూలాయి. ట్రేడింగ్ ఆరంభంలోనే పతనమైన సూచీలు.. నేడు భారీ నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ ఏకంగా 1000 పాయింట్లు కోల్పోగా.. నిఫ్టీ 16,200 కిందకు దిగజారింది.

వెల్లువెత్తిన అమ్మకాలు..
అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాల నేపథ్యంలో దిగ్గజ రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో శుక్రవారం సూచీలు భారీ నష్టాలతో ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. 54,706 పాయింట్ల వద్ద మొదలైన సెన్సెక్స్ ఒక దశలో 54,206 వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి పడిపోయింది. చివరకు

- మిగతా 2 లో

పీఎంఓకు తెలియదట !

- 49 మంది ప్రముఖుల లేఖపై ఆర్టీఐ ప్రశ్నకు బాధ్యతారహిత సమాధానం
- మతహింసపై ప్రధాని చర్యల గురించి లేని సమాచారం

న్యూఢిల్లీ :
ఎన్డీయే అధికారంలోకి వచ్చిననాటి నుంచి దేశంలో మతమౌఢ్యం రాజ్యమేలుతోంది. అధికార పక్షం అండదండలతో మతోన్మాదం కట్టలు తెంచుకుంది. మతతత్వవాదుల ఆగడాలకు అడ్డు-అదుపు లేకుండా పోయింది. ఇదే క్రమంలో హిందూత్వ మూకలు రెచ్చిపోయాయి. మైనారిటీలపై దాడులకు, వేధింపులకు తెగబడ్డాయి. అధికార-కండ బలం ప్రదర్శిస్తూ పైశాచిక ఆనందాన్ని పొందసాగాయి. దీంతో దేశంలో పేట్రేగిన విద్వేషపూరిత నేరాలు, మూకహత్యలపై సెలబ్రిటీలు ఆందోళన వ్యక్తంచేశారు. మతం పేరిట జరిగే హింసాకాండను తక్షణమే కట్టడి చేయాలని ప్రధాని మోదీని కోరారు. ఇదే అంశమై 49 మంది ప్రముఖులు 2019లో ప్రధాని మోదీకి లేఖ రాశారు. కానీ ఆయన స్పందించారా లేదా అన్నది అంతుపట్టలేదు.

ప్రముఖుల లేఖపై ప్రధాని ఏ విధంగా స్పందించారని ఆర్టీఐ ద్వారా ప్రశ్నించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినాగానీ సమాధానం లేదు. చివరకు తమకు తెలియదంటూ ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) బదులివ్వడం గమనార్హం. అప్పట్లో ఈ 49 మందిపై బీజేపీ మద్దతుదారుడు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం దుమారం రేపింది. మరో

- మిగతా 2 లో

'ఉమ్మడి' అభ్యర్థికి వ్యూహం

రాష్ట్రపతి ఎన్నికలపై విపక్ష నేతలతో కాంగ్రెస్ చర్చలు

న్యూఢిల్లీ :
రానున్న రాష్ట్రపతి ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టే అంశంపై కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, సీపీఎం నేత సీతారాం ఏచూరి సహా ప్రతిపక్ష నేతలతో సంప్రదింపులు జరిపారు. తదుపరి భారత రాష్ట్రపతి అభ్యర్థిగా ఎవరిని నామినేట్ చేయాలనే దానిపై ప్రతిపక్ష పార్టీలతో చర్చలు జరపాలని, ఏకాభిప్రాయాన్ని రూపొందించాలని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గేను గాంధీ

- మిగతా 2 లో

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ, పక్కన జేవీఎస్ఎన్ మూర్తి, పైడిరాజు

జగన్నాటకాన్ని ప్రజలు నమ్మరు

- సీఎం వద్దే అధికారం కేంద్రీకృతం
- మూడేళ్లలో అభివృద్ధి శూన్యం
- జగన్ హయాంలో రాష్ట్రం అప్పుల కుప్ప
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర-విశాఖ:
ముఖ్యమంత్రి జగన్ ఆడుతున్న నాటకాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, అబద్ధాలతో ప్రజలను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. విశాఖలోని అల్లిపురం సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 175 స్థానాల్లోనూ వైసీపీ గెలవాలని, సరిగ్గా పనిచేయని ఎమ్మెల్యేలను మారుస్తామని సీఎం జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. మొత్తం అధికారాలను జగన్ తన వద్దే పెట్టుకుని తాడేపల్లి ప్యాలెస్‌లో నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. ఎవరికీ అధికారాలు ఇవ్వకుండా జగన్ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని అన్నారు. మంత్రులకు అధికారాలు లేవు. ఎమ్మెల్యేలు నామమాత్రమే. అలాంటప్పుడు పనిచేయని ఎమ్మెల్యేలను తప్పిస్తానని అనడంలో అర్థం లేదని రామకృష్ణ అన్నారు. ఈ మూడేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఏమి చేసిందో చెప్పాలని

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఏది పడితే... అది మాట్లాడుతున్నాడని అధినాయకత్వం ఈ ఏర్పాటు చేసిపారేసింది!

ఎన్నాళ్లకెన్నాళ్లకు...

టెట్ షెడ్యూలు విడుదల

- ఆగస్టు 6 నుంచి ఆన్‌లైన్లో పరీక్షలు
- పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ
- ఈ నెల 15 నుంచి ఆన్‌లైన్ రుసుముల చెల్లింపు
- సెప్టెంబరు 14న ఫలితాల వెల్లడి
- 2020-22 చివరి ఏడాది అభ్యర్థులూ అర్హులే
- సెప్టెంబరులో 10 వేలతో డీఎస్సీ ?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్, ఆగస్టు-2022) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ శుక్రవారం విడుదల చేసింది. జూన్ 15 నుంచి జులై 15 వరకు ఫీజుల చెల్లింపునకు అవకాశం కల్పించామని, ఆగస్టు 6 నుంచి 21 వరకు ఆన్‌లైన్లో పరీక్షలు నిర్వహిస్తామని, 31న టెట్ కీ, సెప్టెంబరు 14న ఫలితాలు విడుదల చేస్తామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్‌కుమార్ వెల్లడించారు. టెట్ ద్వారా ఉపాధ్యాయ నియామక పరీక్ష(డీఎస్సీ)లో 20శాతం వెయిటేజీ ఉంటుంది. దీంతో టెట్‌లో అత్యధికంగా స్కోరు చేసిన అభ్యర్థులకు డీఎస్సీ విజయం సులువుగా మారుతుంది. నూతన జాతీయ విద్యావిధానం మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ విడత టెట్ పేపర్లను రూపొందించారు. బీఈడీ, డీఎడ్,

- మిగతా 2 లో

ఉపాధ్యాయులపై పనిభారం

- ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యం
- తగ్గనున్న ఉపాధ్యాయ ఖాళీలు
- నూతన విద్యా విధానంపై జీవో 117 జారీ
- వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు
- డీఎస్సీ నియామకాలకు చెక్
- ఉత్తర్వులు పున: సమీక్షించాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
నూతన విద్యా విధానం అమలు(ఎన్ఈపీ)-2020లో భాగంగా ఉపాధ్యాయులు, పాఠశాలల పునర్విభజనపై ప్రభుత్వం విధివిధానాలు వెల్లడించింది. ఈ మేరకు పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ శుక్రవారం ఉత్తర్వులు (జీవో నంబరు 117) జారీజేశారు. ఈ ఉత్తర్వులు ఉపాధ్యాయులపై పనిభారం, ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యమయ్యేలా ఉన్నాయని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులలోని వివరాలివీ. ఈసీసీఈ (ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్), ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ) ప్రాతిపదికగా చేస్తూ ఈ నియమ నిబంధనలను రూపొందించింది. 5+3+3+4 విధానంలో ఫౌండేషన్ స్థాయి 3+2=5 గాను, ప్రిపరేటరీలో 3 నుంచి 5 తరగతులు, మధ్యస్థలో 6 నుంచి 8 తరగతులు, ఉన్నత స్థాయిలో 9 నుంచి 12 తరగతులను చేర్చారు. వాటిని నిర్వహించడానికి ఆరు రకాల పాఠశాలలను ఏర్పాటు చేస్తారు. ఇంగ్లీషు, తెలుగు మీడియంలను కేవలం 9,10 తరగతులకు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.

ఆరు రకాల పాఠశాలలివి...: ఇందులో శాటిలైట్ ఫౌండేషన్ పాఠశాలలు (దీనిలో ప్రీ ప్రైమరీ-1,

- మిగతా 2 లో

చైనా, రష్యా మధ్య తొలి రోడ్ బ్రిడ్జ్ ప్రారంభం

కోవిడ్ కారణంగా రెండేళ్లు ఆలస్యం

మాస్కో : రష్యా, చైనా దేశాల మధ్య మొట్టమొదటి రోడ్‌బ్రిడ్జ్ ప్రారంభమైంది. కిలోమీటరు పొడవు ఉన్న ఈ వంతెన అముర్ నదిపై ఉంది. ఉత్తర చైనాలోని హెహేతో తూర్పు రష్యా నగరమైన బ్లాగోవెశ్‌చెక్‌ను కలుపుతుంది. వంతెన నిర్మాణం రెండేళ్ల కిందటే పూర్తి కాగా కోవిడ్ మహమ్మారి వల్ల ప్రారంభం వాయిదా పడింది. శుక్రవారం బ్లాగోవెశ్‌చెక్‌లో వంతెన ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా రవాణా ట్రక్కులకు బాణాసంచాతో వంతెనపైకి స్వాగతం పలికారు. రెండు లేన్ల ఈ వంతెన నిర్మాణానికి 388 మిలియన్ డాలర్లు అంటే 19 బిలియన్ రూబెల్స్ వరకు ఖర్చు అయినట్లు మాస్కో అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

'ఆహార' బిల్లు.. తడిసి మోపెడు

అధిక ధరలతోనే అదనపు భారం

పేద దేశాల స్థితి ఆందోళనకరం

ఐరాస ఎఫ్ఏఓ నివేదిక

రోమ్ : ప్రపంచ ఆహార దిగుమతి బిల్లు కొత్త రికార్డు సృష్టించబోతోంది. ఈ ఏడాది 1.8 ట్రిలియన్ డాలర్లకు చేరుకోనుంది. పెరిగిపోతున్న ధరలు, రవాణా వ్యయాలతో తడిచి మోపెడవుతోంది. గుప్పెడు గింజల కోసం జేబులు ఖాళీ అవుతున్నాయి. ఐక్యరాజ్య సమితి సారథ్యంలోని ఆహార, వ్యవసాయ సంఘం (ఎఫ్ఏఓ) తాజా నివేదికను విడుదల చేసింది. అందులో పేద దేశాల పరిస్థితిపై ఆందోళన వ్యక్తంచేసింది. తక్కువ ఆహారం కోసం ఎక్కువ చెల్లించుకునే పరిస్థితి ఉందని ఫుడ్ అవుట్‌లుక్‌లో ప్రచురితమైన నివేదికలో ఎఫ్ఏఓ పేర్కొంది. 2021 నుంచి 51 బిలియన్‌లకు ప్రపంచ ఆహార దిగుమతి బిల్లు (గ్లబల్ ఫుడ్ ఇంపోర్ట్ బిల్) చేరింది. అందులో 49 బిలియన్ డాలర్ల పెంపుదలకు అధిక ధరలే కారణమని వెల్లడించింది.

'ఆహార భద్రత దృష్ట్యా ఈ పరిణామాలు ప్రమాదఘంటికలు మోగిస్తున్నాయి. పెరిగిపోతున్న అంతర్జాతీయ వ్యయాలను భరించడం దిగుమతిదారులకు కష్టసాధ్యమవుతుంది. అధిక ధరలు వారి సహనానికి పరీక్ష పెడుతున్నాయి. స్వీయసమృద్ధి కాకుండా అడ్డుకుంటున్నాయి' అని నివేదిక వెల్లడించింది. ఇన్‌పుట్ ధరలు పెరుగుతుండటంతో ఉక్రెయిన్‌లో యుద్ధం కారణంగా మార్కెట్ అస్థిరమవుతుందన్న అభిప్రాయం ఉందని ఎఫ్ఏఓ వెల్లడించింది. ఆహార మార్కెట్లకు బిగుస్తున్న ఉచ్చు, ఆహార దిగుమతి బిల్లు రికార్డు స్థాయికి పెరిగిపోవడాన్ని తాజా పరిణామాలు సూచిస్తున్నాయని ఫుడ్ అవుట్‌లుక్ ఎడిటర్, ఎఫ్ఏఓ ఆర్థికవేత్త ఉపాలి గల్కేటి అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితి మారాలంటే సమతుల్యత ఉండాలని అందుకోసం ఆహార దిగుమతి ఫైనాన్సింగ్ అవసరమని ఎఫ్ఏఓ సూచించింది. తక్కువ ఆదాయంగల దేశాలను స్వీయసమృద్ధిని చేసేందుకు పేమెంట్ సపోర్టు అవసరమని నొక్కిచెప్పింది. అప్పుడు ఆహార భద్రత పరిరక్షణ సాధ్యమని తెలిపింది. మాంసం, నూనెలు వంటివి బిల్లును పెంచుతున్నట్లు వెల్లడించింది. అభివృద్ధి చెందిన దేశాల్లో తృణధాన్యాల బిల్లు తడిచి మోపడవుతోందని పేర్కొంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు మొత్తంగా తృణధాన్యాలు, నూనెగింజలు, మాంసం దిగుమతులను తగ్గించుకోవడాన్ని బట్టి ధరలు భారమవుతున్నట్లు తెలుస్తోందని నివేదిక వెల్లడించింది. 2022లో తృణధాన్యాల ఉత్పత్తి ప్రపంచ వ్యాప్తంగా తగ్గింది. నాలుగేళ్ల తర్వాత ఇలా జరిగింది. అంతర్జాతీయ స్థాయిలో వినియోగంలో 20 ఏళ్ల తర్వాత క్షీణత నమోదు అయింది. నూనెల వినియోగం ఉత్పత్తిని మించిపోయింది. కాగా, అర్జెంటీనా, యూరోపియన్ యూనియన్, అమెరికాలో మాంసం ఉత్పత్తి తగ్గుతుంటే ప్రపంచంలో పాల ఉత్పత్తి గతంలో కంటే నెమ్మదిస్తున్నది. మరోవైపు చక్కెర ఉత్పత్తి మూడేళ్ల తర్వాత పెరుగుతుంది. దీంతో భారత్, థాయిలాండ్, యూరోపియన్ యూనియన్‌కు ప్రయోజనం ఉంటుంది అని ఎఫ్ఏఓ నివేదిక వెల్లడించింది. ఇదిలావుంటే, ఫుడ్ అవుట్‌లుక్ ఏడాదికి రెండుసార్లు వెలువడుతుంది. మార్కెట్ సప్లై, డిమాండు ట్రెండ్లతో పాటు ఫుచర్స్ మార్కెట్స్‌లో ట్రెండ్లనూ ఇది తెలియజేస్తుంది.

మలేసియాలో మరణశిక్ష రద్దు

కేబినెట్ నిర్ణయం

కౌలాలంపూర్ : ఆగ్నేయాసియా దేశమైన మలేసియాలో మరణశిక్షను రద్దు చేస్తున్నట్లు ఆ దేశ ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. హత్య, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వంటి నేరాలకు తప్పనిసరిగా మరణశిక్షను దేశంలో అమలు చేస్తారు. ఇలాంటి నేరాలకు సైతం మరణదండన ఉండరాదని మలేసియా ప్రభుత్వం నిర్ణయించింది. తాజా నిర్ణయాన్ని మానవ హక్కుల సంఘాలు స్వాగతించాయి. అదే సమయంలో చాలా అంశాల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోలేదని దుయ్యబట్టాయి. 2018లో అధికారంలోకి వచ్చిన సంస్కరణవాద కూటమి.. మరణశిక్షను రద్దు చేస్తామని అప్పట్లో ప్రకటించింది. రాజకీయ ప్రత్యర్థులు, హత్యకు గురైనవారి కుటుంబాల నుంచి ప్రతిఘటన రావడంతో ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. అయితే ఇందుకు కసరత్తు కొనసాగిన క్రమంలో శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో తప్పనిసరి మరణశిక్షను రద్దు చేయాలన్న నిర్ణయం జరిగింది. ఈ విషయాన్ని న్యాయ మంత్రి వాన్ జునైదీ టుయాంకు జాఫర్ ధ్రువీకరించారు. మరణశిక్ష స్థానాన్ని ఏ శిక్షతో భర్తీ చేయొచ్చు అన్నది త్వరలోనే అధ్యయనం చేసి నిర్ణయిస్తామని చెప్పారు.

'ఉమ్మడి' అభ్యర్థికి వ్యూహం

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. శుక్రవారం ఖర్గే డీఎంకే నేత తిరుచ్చి శివ, ఆప్ నాయకుడు సంజయ్ సింగ్, సీపీఎంకి చెందిన ఎల్మరాం కరీం, సీపీఐ నేత వినయ్ విశ్వంలతో మాట్లాడారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వారసుడిని ఎన్నుకునేందుకు జులై 18న ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. జులై 21న ఫలితాలు వెలువడనున్నాయి. కోవింద్ పదవీకాలం జులై 24న ముగుస్తుంది. 'ఈ ఎన్నికల్లో మొత్తం 4,809 మంది ఓటర్లు ఓటు వేయనున్నారు. ఏ రాజకీయ పార్టీ తమ సభ్యులకు విప్ జారీ చేయదు' అని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ తెలిపారు. జూన్ 15న నోటిఫికేషన్ వెలువడిన తర్వాత జూన్ 29 వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థి స్వయంగా లేదా అతని ప్రతిపాద కులు లేదా రెండవవారు ఎవరైనా నామినేషన్ దాఖలు చేయవచ్చు. రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఎవరైనా ప్రతిపాదకులుగా 50 మంది ఓటర్లు, రెండవవారుగా మరో 50 మంది ఓటర్లు అవసరమని ఈసీ తెలిపింది. అభ్యర్థి కూడా రూ.15,000 మొత్తాన్ని సెక్యూరిటీగా డిపాజిట్ చేయవలసి ఉంటుంది. రాబోయే ఎన్నికల్లో 776 మంది ఎంపీలు, 4,033 మంది ఎమ్మెల్యేలతో కలిపి 4,809 మంది ఓటర్లు ఉంటారు. వీరిలో 233 మంది రాజ్యసభ సభ్యులు, 543 మంది లోక్‌సభ సభ్యులు ఉన్నారు.

కుప్పకూలిన మార్కెట్లు

(మొదటిపేజీ తరువాయి)

1016.84 (1.94 శాతం) పాయింట్లు పతనమై.. 54,303.44 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ కూడా 276.30 పాయింట్లు (1.68 శాతం) దిగజారి 16,201.80 వద్ద స్థిరపడింది. అన్ని రంగాల షేర్లు నష్టాలను చవిచూశాయి. బ్యాంకింగ్, ఐటీ, ఆర్థిక సేవల సూచీలు భారీగా కుంగాయి. కొటక్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ 4శాతం మేర నష్టపోయాయి. రిలయన్స్ 3 శాతం పతనమైంది.

మార్కెట్ పతనానికి కారణాలివే..: అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు శుక్రవారం వెలువడనున్నాయి. ఈసారి అగ్రరాజ్య ద్రవ్యోల్బణం నాలుగు దశాబ్దాల గరిష్ఠానికి చేరే అవకాశమున్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. ఈ గణాంకాల ఆధారంగానే ఫెడ్ నిర్ణయాలు ఉంటాయి. వచ్చే వారం జరిగే ఫెడ్ సమావేశంలో వడ్డీరేట్లను 50 బేసిస్ పాయింట్లు పెంచే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో అమెరికా మార్కెట్లు గురువారం భారీగా పతనమయ్యాయి. అది దేశీయ మార్కెట్లపైనా పెను ప్రభావం చూపించింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో చమురు, ఆహార పదార్థాల ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో దేశీయంగానూ ద్రవ్యోల్బణం గరిష్ఠ స్థాయికి చేరుతోంది. ద్రవ్యోల్బణం మరింత పెరిగే అవకాశముందన్న ఆర్‌బీఐ అంచనాలు మదుపర్లను కలవరపెడుతున్నాయి. కొన్ని రోజులుగా దేశీయ ఈక్విటీ మార్కెట్లలో విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు వెల్లువెత్తాయి. గురువారం నాటి ట్రేడింగ్‌లో ఎఫ్ఐఐలు రూ.2,407కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.1.80లక్షల కోట్ల పెట్టుబడులను ఎఫ్ఐఐలు ఉపసంహరించుకున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో దేశ కరెంట్ ఖాతా లోటు మూడేళ్ల గరిష్ఠమైన 43.81 బిలియన్ డాలర్లుగా నమోదయ్యే అవకాశముందని ఇండియా రేటింగ్స్ నివేదిక అంచనా వేసింది. ఇది మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఇటీవల దేశంలో కరోనా మహమ్మారి ఉధృతి మళ్లీ పెరుగుతోంది. కొన్ని రోజులుగా కొత్త కేసులు, పాజిటివిటీ రేటు క్రమక్రమంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇది కూడా మదుపర్లపై ప్రభావం చూపించింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ అంతకంతకూ క్షీణిస్తోంది. శుక్రవారం నాటి ట్రేడింగ్‌లో రూపాయి మారకం విలువ 11 పైసలు తగ్గి 77.85 వద్ద సరికొత్త జీవనకాల కనిష్ఠానికి పడిపోయింది.

జగన్నాటకాన్ని ప్రజలు నమ్మరు

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. నీటిపారుదల రంగంలో ఒక్క అడుగు ముందుకు పడలేదని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టును గాలికి వదిలేశారన్నారు. జగన్ సీఎం పీఠం నుంచి దిగే నాటికి రాష్ట్రం అప్పు పది లక్షల కోట్ల రూపాయలకు చేరుతుందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి ఆనవాలు కనిపించడం లేదని ఆరోపించారు. వ్యవసాయం, నీటిపారుదల, పరిశ్రమలు, ఐటీ, మౌలిక సదుపాయాల కల్పనలో ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు. సోలార్ పవర్ కార్పొరేషన్‌తో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం ట్రెండ్ సెట్టర్ అని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ చెప్పడాన్ని ఎద్దేవా చేశారు. సోలార్ విద్యుత్ యూనిట్ రూ.1.99కి లభిస్తుంటే...రూ.2.49కి కొనేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారని మండిపడ్డారు. 25 సంవత్సరాల పాటు ఈ ఒప్పందం అమలులో ఉంటుందని, దీనివల్ల రాష్ట్ర ప్రజలపై 22,500 కోట్ల రూపాయల భారం పడుతుందని చెప్పారు. కోనసీమ రైతులు క్రాప్ హాలిడే ప్రకటిస్తే...అటువంటిదేమీ లేదని వ్యవసాయ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి చెప్పడాన్ని రామకృష్ణ తప్పుపట్టారు. క్రాప్ హాలిడే విరమించుకోవాలని కోనసీమ జిల్లా కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేసిన విషయం వ్యవసాయమంత్రికి తెలియదా అని ప్రశ్నించారు. కడప జిల్లాలో పింఛా, అన్నమయ్య ప్రాజెక్టులు తెగిపోవడానికి కారణం ప్రభుత్వమేనని, కనీసం ప్రాజెక్టులను నిర్వహించలేకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. పదో తరగతి విద్యార్థులు రెండు లక్షల మందికి పైగా ఉత్తీర్ణత కాకపోవడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. దీనిపై చర్చ జరగాలని, విద్యారంగ నిపుణులు, టీచర్ ఎమ్మెల్సీలతో ప్రభుత్వం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించాలని కోరారు. ప్రభుత్వం ఆ పనిచేయని పక్షంలో తామే రౌండ్ టేబుల్ నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని చెప్పారు. విద్యారంగాన్ని ప్రక్షాళన చేయాలని సూచించారు. ఉన్నతవిద్యను పూర్తిగా నాశనం చేశారని విమర్శించారు. వీసీలు నియంతలుగా వ్యవహరిస్తున్నారని, వైసీపీ ఏజెంట్లుగా ఉన్నారని చెప్పారు. యూనివర్సిటీలో అధ్యాపక పోస్టులు మూడు వేలకు పైగా ఖాళీగా ఉన్నాయని, మూడేళ్ల నుంచి డీఎస్సీ నిర్వహించలేదని, ఇంటర్ విద్య పూర్తిగా ప్రైవేటుపరమైందని వివరించారు. మోదీ ప్రభుత్వ సహకారం లేకుండా వైసీపీ ప్రభుత్వం నెల రోజులు కూడా మనుగడ సాగించలేదన్నారు.

ఉద్యోగులకు జీతాలు చెల్లించాలంటే అప్పు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. అప్పులు, వైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసు, ఈడీ కేసులు, సీబీఐ కేసుల విషయంలో జగన్‌కి మోదీ ప్రభుత్వం సహకరిస్తోందని విమర్శించారు. బీజేపీ, వైసీపీ తీరు కేంద్రంలో ముద్దులాట, రాష్ట్రంలో గుద్దులాటలా ఉందని వ్యాఖ్యానించారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ బీజేపీ విషయంలో తన వైఖరి వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల గురించి కాకుండా ఐక్య ఉద్యమాలపై రాజకీయ పార్టీలు ఆలోచించడం మంచిదని హితవు పలికారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు పాల్గొన్నారు.

మిన్నంటిన నిరసనలు

(మొదటిపేజీ తరువాయి)

పరశంత్ కుమార్ చెప్పారు. శుక్రవారం ప్రార్థనలు ప్రశాంతంగా జరిగా యని చెప్పారు. శ్రీనగర్‌లోనూ నిరసనలు వెల్లువెత్తాయి. ముస్లిం వ్యతిరేక చర్యలు ఈ ప్రభుత్వానికి నిత్యకృత్యమైందని హురియత్ కాన్ఫరెన్స్ నింది ంచింది. నగరంలోని లాల్‌చౌక్, బటమలూ, తెంగ్‌పొరా, ఇతర ప్రాంతా ల్లో నిరసనలు జరిగాయి. మహిళలు సైతం ప్లకార్డులు ప్రదర్శించారు. నిరసనల సమయంలో అవాంఛనీయ ఘటనలు ఏమీ జరగలేదని పోలీసులు తెలిపారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా శ్రీనగర్‌లో మొబైల్ ఫోన్లు, ఇంటర్‌నెట్ సదుపాయాన్ని నిలిపివేశారు. కర్ణాటకలోని బెలగావి ఫోర్టురోడ్డులో నుపుర్‌శర్మ దిష్టిబొమ్మను కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ వైర్లకు వేలాడదీశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనిని పోలీసులు, మున్సిపల్ అధికారులు వెంటనే తొలగించారు. నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నుపుర్ శర్మ, నవీన్ జిందాల్‌ను అరెస్టు చేయాలని హైదరాబాద్‌లోని ముస్లింలు డిమాండ్ చేశారు. మక్కామసీదులో ప్రార్థనలు ముగిసిన అనంతరం ముస్లింలు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. మక్కామసీదు నుంచి మొఘల్ పురా ఫైర్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. నుపుర్ శర్మ, నవీన్ జిందాల్‌ను అరెస్టు చేయాలని నినదించారు. చార్మినార్, మక్కామసీదు, కాలపత్థార్, మెహిదీపట్నం, చాంద్రాయణగుట్ట, షాహీన్‌నగర్, సైదాబాద్‌తో పాటు అనేక ప్రాంతాల్లో ముస్లింలు నిరసనలు వ్యక్తం చేశారు. ముస్లింల నిరసనల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పాతబస్తీలో పోలీసులు భారీగా మోహరించారు. చార్మినార్ వద్ద పోలీసు ఉన్నతాధికారులు బందోబస్తును పర్యవేక్షించారు. మహారాష్ట్రలోనూ అనేక ప్రాంతాల్లో నిరసనలు మిన్నుముట్టాయి. మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేతలను అరెస్టు చేయాలని నినదించారు.

పీఎంఓకు తెలియదట !

(మొదటిపేజీ తరువాయి)

185 మంది సెలబ్రిటీలు తమ తోటివారికి అండగా నిలిచారు. మూకహత్యలు, ప్రజల గొంతకను అణచివేయడం, పౌరులను వేధించేందుకు కోర్టులను దుర్వినియోగించడం వంటి అంశాలపై మాట్లాడేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుందంటూ ఓ ప్రకటనను వెలువరించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం-విమర్శించడం దేశద్రోహం ఎలా అవుతుందని నిలదీశారు. కానీ ఈ కేసు తర్వాత మూతపడింది. అయినప్పటికి ఇలాంటి సంచలనాత్మక అంశంపై ప్రధాని స్పందన గురించి సమాచారమే లేదని పీఎంఓ చెప్పడం బాధ్యతరాహిత్యం అనిపించుకోదా!

2019, సెప్టెంబరులో ఆర్టీఐ దరఖాస్తును రామ్ కుమార్ దాఖలు చేశారు. సెలబ్రిటీలు ప్రస్తావించిన అంశంపై ప్రధాని ఏ విధంగా స్పందించారు.. ఎలాంటి చర్యలను తీసుకున్నారని ప్రశ్నించారు. సమాధానమే కరవు కావడంతో మరోసారి అప్పీలు చేశారు. ఈ వ్యవహారంలో గతనెలలో ప్రధాన సమాచార కమిషన్ (సీఐసీ) వైకే సిన్హా ఆధ్వర్యంలో విచారణ జరిగింది. పీఎంఓ తరపున కేంద్ర ప్రజా సమాచార అధికారి (సీపీఐఓ) హాజరయ్యారు. రికార్డుల్లో ఏమీ లేదన్నారు. దరఖాస్తుదారునికి ఇదే విషయాన్ని తెలిపామని చెప్పారు. కుమార్ 2019 సెప్టెంబరు, 2020 జనవరిలో రెండు అప్పీళ్లు చేయగా రెండు సార్లు పీఎంఓ వద్ద ఎలాంటి సమాచారం లేదన్న సమాధానమే సీపీఐఓ నుంచి వచ్చింది. ప్రధాని అధికారిక కార్యకలాపాల సమాచారం పీఎంఓ వద్ద ఉండాలి. మరి ఆ కార్యాలయమే తమకు తెలియదనడం దరఖాస్తుదారుడిన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. రెండేళ్లలో ఈ వ్యవహారానికి సంబంధించి ఎలాంటి సమాచారాన్ని సేకరించేందుకు పీఎంఓ ప్రయత్నించలేదు. సీఐసీ కూడా కుమార్ అప్పీళ్లను కొట్టివేశారు. నాడు దేశంలో పేట్రేగిన మతవిద్వేషం, మూక హత్యలపై 49 మంది సెలబ్రిటీలు తీవ్ర ఆవేదనను వ్యక్తంచేశారు. పార్లమెంటులో మూకహత్యలను విమర్శిస్తే సరిపోదని వాటి కట్టడికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రధానిని ఉద్దేశించి సెలబ్రిటీలు పేర్కొన్నారు. దోషులపై తీసుకున్న చర్యలేమిటని ప్రశ్నించారు. ఇటువంటి నేరాలను నాన్ బెయిలబుల్‌గా ప్రకటించాలని సూచించారు. అలాగే దోషులకు సత్వరమే కచ్చితంగా శిక్ష పడాలన్నారు. 'జై శ్రీరామ్' అనే నినాదం 'వార్-క్రై' (యుద్ధ సమయాల్లో చేసే నినాదం)గా మారడం దురదృష్టకరమని, దీని వల్ల శాంతిభద్రతల సమస్యలు వస్తున్నాయన్నారు.

అయితే ఈ లేఖ రాసినందుకు 49 మంది సెలబ్రిటీలపై 2019, అక్టోబరులో దేశద్రోహంతో పాటు ఐపీసీలోని అనేక సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు అయింది. ప్రభుత్వాన్ని విమర్శిస్తే దేశద్రోహం అభియోగాలు నమోదు చేయొద్దు అని సుప్రీంకోర్టు తేల్చిచెప్పిన తర్వాత కూడా అలా జరిగింది. ఈ పరిణామంపై మిగతా సెలబ్రిటీల నుంచి తీవ్ర ప్రతిస్పందన వచ్చింది. పౌర సమాజ గౌరవ సభ్యులుగా తమ కర్తవ్యాన్ని నిర్వహించిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడమేమిటని 185 మంది సెలబ్రిటీలు ప్రశ్నించారు. ఈ లేఖ రాయడం దేశద్రోహం అయితే పౌరుల గొంతుకను నొక్కేందుకు కోర్టులను దుర్వినియోగం చేస్తుండటాన్ని ఏమంటారని నిలదీశారు. కానీ కాలక్రమేణ ఈ వ్యవహారం మరుగున పడింది. అయితే ప్రధానికి లేఖ రాసిన ప్రముఖుల్లో రామచంద్ర గుహా, మణిరత్నం, అపర్ణ సేన్, శ్యాం బెనెగల్, అనురాగ్ కశ్యప్, నసరుద్దీన్ షా, నయనతార సంఘల్, మల్లికా సారాభాయి, రోమిలా థాపర్, ఆనంద్ తెల్తుండె, టీఎం కృష్ణ, వివన్ సుందరం తదితరులు ఉన్నారు.

పన్ను బకాయిలకు ఓటీఎస్

- సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
- అక్టోబరు 2న శాశ్వత భూహక్కు పత్రాలు
- వాణిజ్య పన్నుల శాఖ పునర్నిర్మాణం
- సమీక్షలో సీఎం వైఎస్ జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పేరుకుపోయిన పన్ను బకాయిల కోసం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) విధానాన్ని తీసుకురానున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఆదాయ వనరులు సమకూర్చే ప్రభుత్వ శాఖల పనితీరుపై శుక్రవారం ఆయన సమీక్షించారు. అనేక ఆదేశాలు, కీలక సూచనలతో పాటు ప్రొఫెషనలిజం ద్వారా సమకూర్చుకునే ఆదాయ వనరులపై దిశానిర్దేశం చేశారు. ఓటీఎస్ విధానం కింద లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లను వేగవంతంగా పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు. టిడ్కోకు చెందిన రిజిస్ట్రేషన్లను పూర్తిచేయాలని, గ్రామ, వార్డు సచివాలయాల్లోకి రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చాక సిబ్బందికి, ఆపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కేవలం ఆస్తుల రిజిస్ట్రేషనే కాకుండా రిజిస్ట్రేషన్‌ప రంగా అందించే ఇతర సేవలపైనా, రిజిస్ట్రేషన్ ప్రక్రియతో న్యాయపరంగా ఎలాంటి హక్కులు వస్తాయి, ఎలాంటి భద్రత వస్తుందన్న విషయాలు తెలపాలన్నారు. అక్టోబరు 2న తొలివిడతగా గ్రామాల్లో శాశ్వత భూ హక్కు, భూ రక్ష పత్రాలతో పాటు సంబంధిత సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందించడానికి చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. ఇప్పటికే 650 గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పత్రాలతో పాటు రిజిస్ట్రేషన్ సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు, ఈ గ్రామాల సంఖ్యను పెంచడానికి చర్యలు చేపట్టినట్లు అధికారులు వివరించారు. 14వేలమంది గ్రామ, వార్డు సెక్రటరీలకు రిజిస్ట్రేషన్‌పై శిక్షణ అందిస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్ సేవలు, భూ హక్కు, భూరక్ష కింద పత్రాలు అందించే గ్రామాల సంఖ్యను పెంచడానికి ప్రయత్నించాలని అధికారులకు సీఎం సూచించారు.

వెదురు పెంపకాన్ని ప్రోత్సహించండి: వెదురు పెంపకాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని అటవీశాఖాధికారులను సీఎం ఆదేశించారు. మైనర్ మినరల్‌కు చెందిన కార్యకలాపాలు నిర్వహించని క్వారీలు 2,700కుపైగా ఉన్నాయని, వాటిలో కార్యకలాపాలు తిరిగి ప్రారంభించాల్సిన అవసరముందని తెలిపారు. ఈ అంశంపై దృష్టి సారించాలని, తద్వారానే ప్రభుత్వానికి ఆదాయాలు పెరుగుతాయన్నారు. ఏపీ ఎండీసీ నిర్వహిస్తున్న సులియారీ బొగ్గు గనుల నుంచి ఉత్పత్తి ప్రారంభమైందని అధికారులు వెల్లడించారు. జెన్కోతోపాటు రాష్ట్రంలోని వివిధ పరిశ్రమలకు దీని నుంచి బొగ్గు సరఫరా అయ్యేలా చూసుకోవాల న్నారు. దీనివల్ల జెన్కో ఆధ్వర్యంలోని విద్యుత్ ప్రాజెక్టులకు మేలు జరుగు తుందని చెప్పారు. బొగ్గుగనుల వేలంలో పాల్గొనడంపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. సమీక్ష లో వాణిజ్య పన్నుల శాఖ పునర్‌ని ర్మాణానికీ, సీఎం జగన్ శాఖలో ప్రతి ఒక్కరి పాత్ర, బాధ్యతలపై స్పష్టత తో పాటు డాటా విశ్లేషణా విభాగం, లీగల్‌సెల్ ఏర్పాటుకు నిర్ణయించా రు. సమీక్షా సమావేశానికి ఉపముఖ్యమంత్రి (ఎక్సైజ్ శాఖ) కె.నారాయణ స్వామి, రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఇంధన, అటవీ పర్యావరణ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సమీర్ శర్మ, అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ స్పెషల్ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసా ద్, రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జి.సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై పనిభారం..

(మొదటిపేజీ తరువాయి)

ప్రీప్రైమరీ -2) ఉంటాయి. ఫౌండేషన్ (ప్రీ ప్రైమరీ 1, ప్రీ ప్రైమరీ 2, 1,2 తరగతులు)లను ఏర్పాటు చేస్తారు. ఇక ఫౌండేషన్ ప్లస్ (ప్రీ ప్రైమరీ 1, ప్రీ ప్రైమరీ 2, 1 నుంచి 5 తరగతులు)తో రూపొందించారు. అలాగే ప్రీ హైస్కూల్ (3 నుంచి 7 లేదా 8 తరగతులు), హైస్కూల్ (3 నుంచి 10 తరగతులు), హైస్కూల్ ప్లస్ (3 నుంచి 12 తరగతులు) ఏర్పాటు చేస్తారు. ఈ పాఠశాలల ఏర్పాటులో భాగంగా ఉపాధ్యాయులను రేషనలైజేషన్ చేస్తున్నారు. ఖాళీ ఉన్న స్థానంలో మిగులు ఉపాధ్యాయులను జూనియర్ అయితే తప్పనిసరిగాను, సీనియర్ అయితే ఇష్టపూర్వకంగా కదలితే వారికి అవకాశమిస్తారు.

పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి ఇలా...: ఫౌండేషన్ పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:30గా నిర్ణయించారు. 31 మంది దాటిన సం దర్భంలోనే రెండవ ఎస్జీటీ పోస్టు ఇస్తారు. 10లోపు (1,2) విద్యార్థులుంటే ఆ వివరాలను కమిషనర్ సేకరించి నిర్ణయిస్తారు. ఫౌండేషన్ ప్లస్ పాఠశాలల్లో ప్రతి 30 మంది కి ఒక ఎస్జీటీని ఇస్తూ 121 మంది విద్యార్థులు దాటితేనే ప్రైమరీ ప్రధానోపాధ్యాయ పోస్టును ఇస్తారు. ప్రీ హైస్కూళ్లకి 98 మంది కంటే తక్కువ విద్యార్థులుంటే కేవలం ఎస్జీటీ పోస్టులను (1:30) నిష్పత్తిలో కేటాయిస్తారు. 195 కంటే ఎక్కువ ఉంటే ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తారు(దీనికి 3 కిలోమీటర్ల లోపు ఉన్నత పాఠశాల ఉండరాదు). ఉన్నత పాఠశాలలు (ఎ) (3-10 తరగతులు)కు 137 కంటే తక్కువ విద్యార్థులుంటే హెచ్ఎం, పీడీ (ఫిజికల్ డైరెక్టరు) పోస్టులు రద్దు చేసింది. సీనియర్ స్కూల్ అసిస్టెంట్‌ను ఇన్‌చార్జి హెచ్ఎంగా నిర్ణయిస్తారు. 401 కంటే ఎక్కువ ఉంటేనే 2వ పీడీ 761 కంటే ఎక్కువ ఉంటేనే 3వ పీడీ పోస్టులు ఇస్తారు. 275 కంటే ఎక్కువ ఉన్న బాలికోన్నత పాఠశాలలకు సంగీతం, డాన్స్ వంటి ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు ఇస్తారు. ఫౌండేషన్, ఉన్నత పాఠశాలలు ఒకే చోట ఉంటే హైస్కూల్ ప్రధానోపాధ్యా యులే ఇన్‌ఛార్జిగా వ్యవహరించాలి. ఉన్నత పాఠశాలలు (బి) (6-10 తరగతులు)కు 92 కంటే తక్కువ విద్యార్థులుం టే హెచ్ఎం, పీడీ పోస్టులు రద్దు చేస్తారు. సీనియర్ స్కూల్ అసిస్టెంట్‌ని ఇన్‌ఛార్జిగా నియమిస్తారు. 401 మంది విద్యార్థులకు ఇద్దరు పీడీలను, 761 మందికి ముగ్గురు పీడీలను కేటాయిస్తారు.

ఈ జీవోతో ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యం: ఎస్టీయూ

నూతన విద్యా విధానం అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల(జీవో నంబరు-117)తో ఉపాధ్యాయులకు పనిభారం పెంచేదిగాను, ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసేదిగా ఉందని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎస్టీయూ నేతలు జీవోలో నష్టాలను వివరించారు. 1 నుంచి 8వ తరగతి వరకు కేవలం ఇంగ్లీషు మీడియంగా పరిగణించి ఉపాధ్యాయ పోస్టులను రేషనలైజేషన్ చేయడం వల్ల చాలా పోస్టులు రద్దవుతాయని, దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. 17 సెక్షన్ల వరకు ఒకే హిందీ పోస్టుతో ఎలా బోధించాలని ప్రశ్నించారు. 18 సెక్షన్ల ఉన్నత పాఠశాలలకు మూడు గణితం పోస్టులు ఇచ్చారని, దీంతో ప్రతి ఉపాధ్యాయుడు 48 పీరియడ్లు బోధించాల్సి ఉంటుందన్నారు. తెలుగు, ఇంగ్లీషు, పీఎస్, జీఎస్, సోషల్ స్టడీస్ వారికి 36 పీరియడ్లు బోధించాలని, దీనికితోడు యాప్ అప్‌లోడ్, ఫోటోల అప్‌లోడ్, మార్కుల ఆన్‌లైన్, స్పాట్ వాల్యూషన్ వంటి పనులు అదనంగా ఉంటాయని పేర్కొన్నారు. 92 కంటే విద్యార్థులు తక్కువ ఉన్న చోట్ల హెచ్ఎం, పీడీ పోస్టులు రద్దు చేశారని, దీంతో డీఎస్సీ నియామకాలు చేపట్టవలసిన అవసరంగాని, అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌లను నియమించాల్సిన అవసరంగాని లేకుండా చేశారన్నారు. నాడు-నేడు పేరుతో సర్వాంగ సుందరంగా పాఠశాలలను తీర్చిదిద్ది ఉపాధ్యాయుల సంఖ్య సగానికి ప్రభుత్వం తగ్గించిందన్నారు. బోధన భారాన్ని ఉపాధ్యాయులపై మోపి, ప్రాథమిక పాఠశాలలను ఏకోపాధ్యాయ పాఠశాలలుగా చేయడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను పున:సమీక్షించాలని ఎస్టీయూ నేతలు డిమాండు చేశారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు...

(మొదటిపేజీ తరువాయి)

లాంగ్వేజీ పండిట్లలో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్న(ఛాత్రోపాధ్యాయులు) టెట్ రాసేందుకు అర్హులు. గతంలో టెట్‌లో అర్హత సాధించి, మళ్లీ స్కోరింగ్ పెంపు కోసం ఈ పరీక్ష రాసుకోవచ్చు. 1-5 తరగతులు బోధించే అభ్యర్థుల కోసం పేపర్ -1(ఎ, బి), 6-8 తరగతుల బోధనకు పేపర్-2(ఎ,బి)లో అర్హత సాధించాల్సి ఉంటుంది. ఆయా పేపర్ల ఆధాంగా ఇంటర్మీడియట్, డిగ్రీ, మాస్టర్ డిగ్రీతోపాటు బీఈడీ/డీఈడీ, లాంగ్వేజీ పండిట్, డీపీఈడీ, బీపీఈడీ లేదా తత్సమానం కోర్సులు చేసిన వారు అర్హులు. 2020-22లో చివరి ఏడాది ఉపాధ్యాయ శిక్షణ కోర్సు చదువుతున్న వారు సైతం టెట్‌కు అర్హులుగా నిర్ణయించారు. ఎస్జీటీ అభ్యర్థులు రాసే పేపర్లకు డీఎడ్ వారితోపాటు బీఈడీ వారికీ అవకాశం కల్పించారు. ఆ దిశగా రాబయే డీఎస్సీలోనూ ఎస్జీటీ పోస్టులకు బీఈడీ వారికి ప్రభుత్వం అర్హత కల్పించనుంది. గతంలో టెట్ వాలిడిటీని ఏనిమిదేళ్లు ఉండగా, ప్రస్తుతం దానిని జీవితకాలం పొడిగించారు.

150 మార్కులతో టెట్: ఏపీ టెట్‌ను 150 మార్కులతో నిర్వహిస్తారు. దీనికి టెట్‌లో ఓసీ అభ్యర్థులు 60శాతం మార్కులపైన(అనగా 150 మార్కులకు 90 మార్కులు సాధించాలి), బీసీలు 50శాతంపైన (150/75), ఎస్సీ, ఎస్టీ, పీహెచ్, ఎక్స్‌సర్వీస్‌మెన్ అభ్యర్థులు 40శాతం పైన(150/60మార్కులు) సాధించాలి. మార్కుల ఆధారంగా మొత్తం 20 మార్కులకు వెయిటేజీ ఉంటుంది. అందులో సాధించిన స్కోర్‌ను, భవిష్యత్తులో రాయబోయే డీఎస్సీ మార్కులకు కలుపుతారు. ఏపీలోని అన్ని జిల్లాలతోపాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఒడిశాలో పరీక్షా కేంద్రాల్ని ఏర్పాటు చేశారు. సెషన్-1 పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు, సెషన్-2 పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు.

2018 తర్వాత మళ్లీ టెట్: టీడీపీ ప్రభుత్వ హయాంలో చివరిగా 2018లో ఏపీ టెట్ జరిగింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే టెట్ నిర్వహిస్తారని అభ్యర్థులు ఆశించారు. వైసీపీ ప్రభుత్వం గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి, వాటి ద్వారా లక్షా 35వేల శాశ్వత ఉద్యోగాలు భర్తీ చేసింది. ఇదే సమయంలో డీఎస్సీ ప్రకటన జారీచేస్తారని అభ్యర్థులు ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కరోనా రావడంతో రాష్ట్రంలో పరిస్థితి భిన్నంగా మారింది. మూడేళ్లపాటు ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకుని, టెట్ నోటిఫికేషన్ కోసం వేలాది మంది అభ్యర్థులు నిరీక్షిస్తున్నారు. ఇప్పటికే టెట్‌లో 8 లక్షల మంది అభ్యర్థులు అర్హత సాధించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఏడాదికి రెండు విడతలుగా రాష్ట్ర ప్రభుత్వాలు టెట్ నిర్వహించాలి. దానికి భిన్నంగా రెండు, మూడేళ్లకోసారి నిర్వహించడంతో అభ్యర్థులు భారీగా పోటీ పడాల్సి వస్తోంది. టెట్ నిర్వహించిన వెంటనే డీఎస్సీ ప్రకటన ఇవ్వడం ఆనవాయితీగా మారడంతో అభ్యర్థులు సమయం చాలక నష్టపోతున్నారు.

సెప్టెంబరులో జంబో డీఎస్సీపై కసరత్తు

సెప్టెంబరులో 10వేల ఉపాధ్యాయ పోస్టులతో జంబో డీఎస్సీకి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే యేటా డీఎస్సీ ఇస్తామని ప్రకటించారు. మూడేళ్లపాటు డీఎస్సీ లేనందున, ఇప్పుడు టెట్ ఏర్పాటు చేయడంతో ఆ మూడేళ్ల ఖాళీలతో కలిపి భారీగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం సన్నద్ధమైనట్లు సమాచారం. దీనికి సంబంధించిన ఖాళీలపై విద్యాశాఖాధికారులు ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిసింది.

రైతుకు దగా...

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి చెందిన దేశాల రైతులకు దిగుమతుల ద్వారా చాలా ఎక్కువ ధర చెల్లిస్తున్నారు. భారతదేశం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించే విధంగా మన స్వంత రైతులకు లాభదాయకమైన ధరలను అందించడానికి బదులు, ప్రభుత్వం వారి పట్ల వివక్ష చూపుతోంది' అని తెలిపారు. స్వామినాథన్ కమిషన్ నివేదిక ప్రకారం ఎంఎస్‌పీ అందించడంపై వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ చేసిన వాదనలు 'తప్పు' అని ధవాలే చెప్పారు. ఏ2+ఎఫ్ఎల్ మునుపటి సూత్రం ద్వారా ఖర్చుల గణన జరిగింది. ఇక్కడ నగదు, కుటుంబ శ్రమతో కొనుగోలు చేసిన ఇన్‌పుట్‌లకు ఏ2 ఖాతాలు ఉంటాయని అన్నారు. వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ సీ2+50 శాతం ఫార్ములా ద్వారా వ్యయాలను లెక్కించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. . 'స్వామినాథన్ కమిషన్ సీ2+50 శాతం సూత్రాన్ని అమలు చేయాలని, మొత్తం ఉత్పత్తి వ్యయాన్ని వాస్తవికంగా అంచనా వేసి, రైతులకు దానికంటే 50 శాతం తిరిగి చెల్లించేలా చూడాలని మేము డిమాండ్ చేస్తున్నాం. పప్పు ధాన్యాలు, నూనెగింజలు, మినుములకు ప్రభుత్వ సేకరణ వ్యవస్థలు ఉండేలా చూసుకోవాలి. తద్వారా రైతులు ఈ పంటలను ఎక్కువగా పండించడానికి ప్రోత్సాహం లభిస్తుంది. పప్పు ధాన్యాలు, నూనెగింజల కోసం భారతదేశం దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చు' అని అన్నారు. అలాగే వంట నూనెలు, పప్పులను ప్రజా పంపిణీ వ్యవస్థలో చేర్చాలని అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) కోర్ కమిటీ సభ్యుడు యోగేంద్ర యాదవ్ మాట్లాడుతూ ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ 2022-23 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 6.7 శాతంగా ఉంటుందని అంచనా వేసిందని అన్నారు. డీజిల్, ఎరువుల ధరలు గణనీయంగా పెరిగినందున రైతులకు ఇన్‌పుట్ ధర పరంగా ద్రవ్యోల్బణం మరింత ఎక్కువగా ఉందని చెప్పారు. '14 పంటలలో 11 పంటలకు కనీస మద్దతు ధర పెరుగుదల ధర ద్రవ్యోల్బణం కంటే తక్కువగా ఉందని స్పష్టమవుతోంది. అందువల్ల, వాస్తవంగా 11 పంటలకు ఎంఎస్‌పీ తగ్గింది' అని అన్నారు.

వైసీపీ దమనకాండ

- టీడీపీ నేతలపై అక్రమ కేసులు
- కోనసీమలో చిచ్చుపెట్టిందెవరు ?
- పది ఫలితాలకు ప్రభుత్వమే కారణం
- పోలీసులపై ప్రైవేట్ కేసులేస్తాం
- టీడీపీ అధినేత చంద్రబాబు
- మూడేళ్ల వైసీపీ పాలనలో హత్యలు-అరాచకాలపై పుస్తకావిష్కరణ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మూడేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని వల్లకాడు చేశారని, వేధింపులు, హింసతో ప్రజలను, రాజకీయ పార్టీ నేతలను భయపెడుతూ దమనకాండ కొనసాగిస్తున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో శుక్రవారం మూడేళ్ల వైసీపీ పాలనలో హత్యలు, అరాచకాలపై టీడీపీ ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరించి చంద్రబాబు విడుదల చేశారు. వైసీపీ దమనకాండపై ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను చంద్రబాబు, టీడీపీ నేతలు తిలకించారు. రాష్ట్రంలో అక్రమ కేసులతో వేధిస్తున్న పోలీసు అధికారులపై ప్రైవేటు కేసులు వేస్తున్నామని ఆయన ప్రకటించారు. మూడేళ్ల పాలనలో 60 మంది టీడీపీ ప్రజా ప్రతినిధులపై కేసులు పెట్టారని, గ్రామ స్థాయిలో నాలుగు వేల మందిపై కేసులు పెట్టారని, ఆరుగురు మాజీ ఎమ్మెల్యేలను జైలుకు పంపారన్నారు. మరో నలుగురు మాజీ మంత్రులను అరెస్టు చేసి, జైలుకు పంపారని మండిపడ్డారు. నాతో సహా పార్టీలోని నేతలపై కేసులు పెట్టారన్నారు. దళితులు, గిరిజనులు, బీసీ, మైనార్టీలపై హత్యాకాండ జరుగుతోందని, రాష్ట్రంలో కరోనాను సరిగా ఎదుర్కోని కారణంగా 88 వేల మంది ప్రాణాలు కోల్పోయారని, 2,552 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వివరించారు. మరో 37 మంది టీడీపీ కార్యకర్తలను పొట్టన పెట్టుకున్నారని, ఇందులో 24 మంది బీసీ నేతలున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీజీపీ మారినా రాష్ట్రంలో పోలీసు శాఖలో మార్పు రాలేదని తెలిపారు. పోలీసులు ఇప్పటికైనా మారకుంటే, మార్చే శక్తి ప్రజలకు ఉందన్నారు. ఒక్క మాచర్లలో ఐదుగురిని చంపేశారని, చంద్రయ్యను చంపిన సమయంలో కఠిన చర్యలు తీసుకుని ఉంటే, జల్లయ్య హత్య జరిగేదా? అని ప్రశ్నించారు. అనంతబాబు అనే ఎమ్మెల్సీ డ్రైవర్‌ను చంపేసి డెడ్ బాడీ ఇంటి దగ్గరకు తెచ్చిపడేస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి వివేకా హత్య కేసులో పరోక్షంగా, ప్రత్యక్షంగా సంబంధాలున్న వారంతా ఒక్కొక్కరూ చనిపోతున్నారన్నారు. ఈ కేసు విచారిస్తున్న సీబీఐకి సమర్థత లేకుంటే, దేశాన్ని ఎవరు రక్షిస్తారంటూ ప్రశ్నించారు. ప్రజా సంఘాలు, టీడీపీ నేతలు ఆందోళన చేస్తే తప్పు ఎమ్మెల్సీని అరెస్టు చెయ్యరా? అని నిలదీశారు. అసలు డీజీపీ ఉన్నారా?, ఖాకీ దుస్తులకు ఆయన న్యాయం చేయాలన్నారు. కోనసీమలో చిచ్చు ఎవరు పెట్టారని, ఇప్పుడు తప్పుడు కేసులు పెట్టి మళ్లీ అందరినీ వేధింపులకు గురి చేస్తున్నారని ప్రశ్నించారు. జగన్‌పై ఉన్న అక్రమ ఆస్తుల కేసులు ఏమయ్యాయని ప్రశ్నించారు. రెండు లక్షల మంది పదవ తరగతి విద్యార్థుల ఫెయిల్‌కు ప్రభుత్వమే కారణమైందని దుయ్యబట్టారు. వ్యవసాయం సర్వనాశనమై, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సీఐడీ 41-ఎ నోటీసు ఇవ్వడానికే ఉందా? అని ఎద్దేవా చేశారు. గౌతు శిరీషను అడ్వకేట్ సమక్షంలో ఎందుకు విచారించ లేదంటూ నిలదీశారు. మాజీ మంత్రి నారాయణను అరెస్టు చేసిన విధానం దారుణంగా ఉందన్నారు. పోలీసులపై ప్రైవేట్ కేసులు వేసి పోరాడతామని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక ఒక ట్రిబ్యునల్ వేసి అక్రమ కేసులు అన్నీ స్టడీ చేస్తామని, నిబంధనలు పాటించని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల ఆత్మహత్యలపై లోకేష్ మీటింగ్ పెడితే, వైసీపీ ప్రజాప్రతినిధులు రావడాన్ని తప్పుపట్టారు. ఎంపీ విజయసాయిరెడ్డి బెదిరింపులకు భయపడబోమని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

రాజద్రోహం, ఉపా చట్టాలను రద్దు చేయాల్సిందే

మార్క్సిస్టు అధ్యయన కేంద్రం కన్వీనర్ జేవీఎస్ఎన్

విశాలాంధ్ర - పెందుర్తి: ప్రజాస్వామ్యానికి పెనుముప్పు కలిగించే రాజ ద్రోహం, ఉపా చట్టాలను రద్దు చేయాల్సిందేనని మార్క్సిస్టు అధ్యయనం కేంద్రం కన్వీనర్ జేవీ సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. పౌరప్రజాసంఘాల వేదిక సమన్వయకర్త పాత్రుపల్లి చంద్రశేఖర్ అధ్యక్షతన జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేవీఎస్ఎన్ మాట్లాడుతూ బ్రిటిష్ కాలంనాటి రాజద్రోహం చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యవాదులు, కవులు, కళాకారులను అరెస్టులు చేయిస్తూ పైశాచికానందం పొందుతోందని విమర్శించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం తప్పులను ఎత్తి చూపిన వారిపై పోలీసులతో దాడులు చేయించి వేధిస్తోందని మండిపడ్డారు. ఇలాంటి పోకడలను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని డిమాండ్ చేశారు. రాజద్రోహం చట్టం రద్దుకు సుప్రీం కోర్టు పూనుకోవడం స్వాగతించాల్సిన అంశమని, అయితే మోదీ సర్కారు మరిన్ని ప్రమాదకర చట్టాలను తీసుకురావడానికి కుట్రలు చేస్తుందన్న అనుమానం వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి చైతన్య, మహిళా సంఘం ప్రతినిధి పద్మ, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాంబాబు, ఐటీయూసీ నాయకులు పడాల గోవింద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, ఎస్‌యూసీఐ నాయకులు కె.గోవిందరాజులు, మురికివాడల నిర్వాసితుల సంఘం నాయకులు రవి, ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య కార్యదర్శి ఎం.ఎ.బేగం, ప్రజానాట్యమండలి నాయకులు దేవుడమ్మ, ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్మిక సంఘం నాయకులు వై.నందన్న, నెయ్యిల నాగభూషణం, ఇన్సాఫ్ నాయకులు అబ్దుల్ రజాక్, విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు ఎస్.కిషోర్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకురాలు ఎ.బాలనాగమ్మ, భారత నాస్తిక సమాజం ప్రతినిధులు రామప్రభు, జ్ఞానానంద, ఫిషింగ్ హార్బర్ యూనియన్ ప్రతినిధి కె.వజ్రం తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు అమ్మకాన్ని విరమించుకోవాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం : విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ అధ్వర్యంలో కూర్మన్నపాలెంలో విశాఖ స్టీల్ ముఖద్వారం వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 484వ రోజుకి చేరాయి. ఈ దీక్షా శిబిరంలో ఉక్కు కర్మాగారం నుంచి బీఎఫ్ విభాగం నుంచి అఖిల పక్ష కార్మిక యూనియన్ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు. వీరిని ఉద్దేశించి ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ అధ్వర్యంలో 484 రోజులుగా కొనసాగుతున్న దీక్షలు అభినందనీయమని, అందుకు సహకరిస్తున్న కార్మిక వర్గ పట్టుదలకు జేజేలని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి విశాఖ స్టీల్ అమ్మక ప్రతిపాదనను విరమించుకుంటున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, ఇతర ప్రతినిధులు కె.ఎస్.ఎన్., గంధం వెంకట్రావు, యు.వీరాస్వామి, జె.రామకృష్ణ, వరసాల శ్రీను, జి.బోసుబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని అన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమ ఫలితాలు అనేక వేల మందికి అందుతాయన్న భావనతోనే ఆనాటి ప్రజలు భూములను త్యాగం చేశారని తెలిపారు. 20 మిలియన్ టన్నుల సామర్థ్యానికి అవసరమైన భూములు మాత్రమే విశాఖ ఉక్కు వద్ద ఉన్నాయని, వాటిని కాజేయాలని ఎవరు చూసినా ఉపేక్షించమన్నారు. దీక్షా శిబిరంలో బి.ఎఫ్ విభాగం ప్రతినిధులు వి.రామకోటేశ్వర రావు, సూర్యనారాయణ, డి.శ్రీను, డి.ఇ.వి.ప్రసాద్, కొణతాల శ్రీను, మల్లేశ్వర రావు, చందర్, వెంకట్రావు, మధు, టి.ఈశ్వర రావు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో 175 స్థానాల్లో గెలుపు

విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: రాష్ట్రంలో సుభిక్ష పాలన జరుగుతోందని ప్రజలకు సంక్షేమ పథకాలు 95శాతం పూర్తి చేశామని, వచ్చే ఎన్నికల్లో 175కు 175 స్థానాలు గెలిచే అవకాశాలు ఉన్నాయని వైసీపీ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి అన్నారు. శుక్రవారం చాపాడు మండలం వద్ద సీబీఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ, సామాజిక, ఆర్థిక అసమానతలు లేకుండా చేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆశయమన్నారు. ఉపాధి, ఉద్యోగ కల్పన అన్నది నిరంతర ప్రక్రియ అని అందులో భాగమే తిరుపతి, గుంటూరు, వైజాగ్‌లలో మెగా జాబ్ మేళా నిర్వహించి 43 వేల ఉద్యోగాలు ఇప్పించగలిగామన్నారు. కడప జిల్లాలో 10వేల ఉద్యోగాలు లక్ష్యంగా పెట్టుకున్నామని ఎవరికైనా ఉద్యోగాలు రాకపోతే స్కిల్ డెవలంమెంట్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా 90 శాతం పూర్తి చేశామని విద్యా, ఉపాధి రంగాల్లో కూడా అవకాశాలు ఇవ్వాలన్నారు. ప్రతిపక్షం విమర్శించినట్లు ఇది బోగస్ కాదని ఇప్పించిన ఉద్యోగాల లిస్ట్ ఇచ్చామన్నారు. ప్లీనరీ పూర్తయిన తరువాత సీఎం ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా జాబ్ మేళా ప్రక్రియను ప్రకటించడం జరుగుతుందన్నారు. వివేకా హత్యకేసుకు సంబంధించి గంగాధర రెడ్డి మృతిపై స్పందిస్తూ, సహజంగా మరణించినా దానిని మాపై ఆపాదిస్తున్నారని, ఆరోపణలు చేయడమే ధ్యేయంగా చంద్రబాబు ఆయన కుమారుడు ప్రవర్తిస్తున్నారన్నారు. రాష్ట్రపతి ఎన్నికల విషయంలో పార్టీ అధినేత జగన్‌దే తుది నిర్ణయమన్నారు. మూడేళ్ళలోనే హామీలను నెరవేర్చామన్నారు. ప్రతిపక్షాలు ఏకమైనా మాకేమి భయంలేదని తెలిపారు. ప్రతిపక్షాలలో వారిలో వారికే పొంతన లేదని, మాకు పొత్తులతో పనిలేదన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, ఆప్కాబ్ చైర్మన్ మల్లెల ఝాన్సీ, సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ సులి సునీల్‌కుమార్, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నన్నెవరూ అడ్డుకోలేరు: తమిళిసై

హైదరాబాద్: తెలంగాణ మహిళలు ఇబ్బందులు పడుతుంటే తాను చూస్తూ ఊరుకోనని.. వారి కోసం తన పోరాటం కొనసాగుతూనే ఉంటుందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ స్పష్టం చేశారు. వారిని ఆదుకోవడానికి ఎప్పుడూ ఒక బలమైన శక్తిగా ముందుంటానని చెప్పారు. తమిళిసై అధ్వర్యంలో రాజ్‌భవన్‌లో మహిళా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా దర్బార్‌లో భాగంగా మహిళల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్టేజ్ మీద ఓ వృద్ధురాలిని కూర్చోబెట్టుకుని మహిళల సమస్యలు విన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న అత్యాచారాలపై సమావేశానికి హాజరైన మహిళలు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజా దర్బార్‌కు వచ్చిన మహిళలను ఉద్దేశిస్తూ తమిళిసై తెలుగులో ప్రసంగించడం విశేషం. 'గవర్నర్ ప్రజలను కలుస్తారా? అని చాలా మందికి అనుమానాలు ఉన్నాయి. ఏ ప్రభుత్వ కార్యాలయమైనా ప్రజల కోసమే అని గుర్తుంచుకోవాలి. సెక్యూరిటీ వాళ్లు వద్దన్నా కోవిడ్ సమయంలో రోగులను పరామర్శించాను. మహిళలు సమాజంలో ఎక్కువగా బాధింపబడుతున్నారు. ఒక మహిళగా బాధిత మహిళలకు అండగా ఉండి, ఆదరించాలని ఆశిస్తున్నాను. నా తెలంగాణ మహిళలకు తోడుగా ఉండాలని అనుకుంటున్నాను. మహిళలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటాను. ఈ విషయంలో ఎదురు చెప్పే వాళ్లను నేను పట్టించుకోను. నిరసనకారుల గురించి నేను ఆందోళన పడటం లేదు. తెలంగాణ మహిళలు సురక్షితంగా ఉండాలి. ఒక సోదరిలా తెలంగాణ మహిళల వెన్నంటి ఉంటాను. నన్ను ఎవరూ అడ్డుకోలేరు. బాధితుల స్వరాన్ని ప్రభుత్వానికి వినిపిస్తాను. వాటికి స్పందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. విధానం ఏదైనా ప్రజల కోసమే పని చేయాలి. వినిపించని మహిళల స్వరం కూడా వినిపించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలకు ఇలాంటి మద్దతు చాలా అవసరం. మనం గెలుస్తాం.. మన గెలుపును ఎవరూ ఆపలేరు" అని మహిళలకు గవర్నర్ భరోసా ఇచ్చారు.

ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదు..

"24 గంటల క్రితమే మహిళలను కలవాలని నిర్ణయం తీసుకున్నాను. మంచి స్పందన వచ్చింది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ముందుగా మహిళా దర్బార్ నిర్వహించాను. మహిళలకు అండగా ఉండాలనే దీన్ని నిర్వహించాను. ఇందులో ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదు. కొందరు రాజ్‌భవన్‌లో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడాన్ని ప్రశ్నిస్తున్నారు. రాజ్‌భవన్‌కు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించే హక్కు ఉంది. ఇది పొలిటికల్ కార్యాలయం కాదు.. నేను చేయదగిన కార్యక్రమాలు మాత్రమే నిర్వహిస్తున్నా. మహిళా దర్బార్‌ను భవిష్యత్తులోనూ కొనసాగిస్తాను. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజల కోసమే ఉన్నాయి. రాజ్‌భవన్‌ను గౌరవించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా. ప్రజలు నా దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు ప్రభుత్వానికి పంపిస్తాను. ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నా. జూబ్లీహిల్స్ గ్యాంగ్ రేప్ కేసుకు సంబంధించి రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించాను. ఇప్పటివరకు ఎలాంటి నివేదిక ఇవ్వలేదు. ఎన్నికైన ప్రభుత్వాన్ని నేను గౌరవిస్తాను. ప్రభుత్వం కూడా అలాగే స్పందించాలి. ప్రభుత్వం ప్రొటోకాల్ సరిగా పాటించడం లేదు. అది నన్ను ఆపలేదు. నేను వివాదాస్పద వ్యక్తిని కాదు. తెలంగాణ ప్రజలకు సేవ చేసే లక్ష్యంతో పని చేస్తున్నా" అని గవర్నర్ పేర్కొన్నారు.

జూబ్లీహిల్స్ ఘటనపై కాంగ్రెస్ ఫిర్యాదు

జూబ్లీహిల్స్ ఘటనలో సాక్ష్యాలు తారుమారు చేసే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఘటనలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఘటన వివరాలు అడగడానికి ప్రయత్నిస్తే మహిళా నేతలను అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం రాజ్ భవన్‌లో గవర్నర్ ప్రారంభించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ మహిళా నేతలు మాజీ మంత్రి గీతా రెడ్డి, మాజీ కేంద్రమంత్రి రేణుకా చౌదరి, మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, టీపీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా జూబ్లీ హిల్స్ గ్యాంగ్ రేప్‌పై గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర మొదటి పౌరురాలిగా ఈ కేసుపై జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరగా దీనికి ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు. మహిళా దర్బార్ మంచి కార్యక్రమమని, రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు జరుగుతుంటే సీఎం మౌనంగా ఉన్నారని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని, చివరకు పోలీస్ స్టేషన్‌లకు మహిళలు వెళ్లలేని పరిస్థితి రాష్ట్రంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి బొల్లిముంత

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

ముగిసిన తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవాలు

విశాలాంధ్ర-తెనాలి: ప్రజలే చరిత్ర నిర్మాతలు అనే సిద్ధాంతంతో తన రచనల ద్వారా తనదైన పంథాలో సమాజ చైతన్యం కోసం శ్రమించిన బహుముఖ ప్రజ్ఞాశాలి బొల్లిముంత శివరామకృష్ణ అని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. కళాక్షేత్రం వేదికగా ఈనెల 6 నుంచి జరిగిన తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. పిన్నక శేషభాను అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన శివకుమార్ మాట్లాడుతూ బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ తెలుగు సాహితీ సాంస్కృతిక అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే మహాసంకల్పంతో నిర్వహించిన కార్యక్రమాలు ఉత్తేజాన్ని నింపాయన్నారు. బొల్లిముంత వంటి మహనీయులు తెనాలి ప్రాంతంలో జన్మించడం ఈ ప్రాంత వాసులకు గర్వకారణమన్నారు. వారి ఆలోచనలను, ఆశయాలను భావితరాలకు పంచేలా ఫౌండేషన్ మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

ఇస్రో పూర్వశాస్త్రవేత్త చందు సాంబశివరావు మాట్లాడుతూ సాహితీ ఉత్సవాలతో పాటు నాటక కళలకు ప్రోత్సాహాన్ని ఇస్తూ నిర్వహించిన నాటికలు కళాత్మకంగా ఉన్నాయన్నారు. బొల్లిముంత సేవలను స్మరించుకుంటూ వివిధ రంగాల ప్రతిభావంతులను సత్కరించుకోవడం సముచితమన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ బొల్లిముంత శివరామకృష్ణ వామపక్ష భావజాలంతో తన రచనల ద్వారా సమాజానికి విశేష సేవలందించారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి ఆయన రచించిన మృత్యుంజయ నవల నాంది పలికిందన్నారు. సమాజంలో అసమానతలను అధిగమించి ప్రజలను చైతన్యవంతులను చేయడమే బొల్లిముంత రచనల ప్రాధా న్యత అని, ఆయనను స్మరించుకునే సభలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎస్టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు యస్.రామచంద్రయ్య మాట్లా డుతూ సమాజంలోని సమస్యలను ఇతివృత్తంగా మార్చు కుని బొల్లిముంత రచనలు సాగించారన్నారు. ఆయన నవలలు, నాటికలు సమాజ చైతన్యానికి మార్గదర్శకంగా నిలిచాయన్నారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తోటకూర వెంకట రమణారావు మాట్లాడుతూ బొల్లిముంత సాహిత్యాంశాలు నవసమాజ నిర్మాణానికి నాంది పలికేలా ఉంటాయనడంలో అతిశయోక్తి లేదన్నారు. తొలుత బొల్లిముంత రచనలు, తాత్విక దృక్పథం, వక్తృత్వం అనే అంశాలపై గోలి సీతారామయ్య కీలక ఉపన్యాసం చేశారు.

విశ్రాంత ఉపాధ్యాయులు కనపర్తి కృపాదాసు, కోడే గౌరీశంకర్, బర్మా రవిలను ఘనంగా సత్కరించారు. అంబటి మధుమురళి, బూరెల దుర్గాప్రసాద్, కన్నల్ పీఎల్ భక్షి, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, ఎం.సత్యనారాయణశెట్టి, జొన్నల పేరిరెడ్డి తది తరులు పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా ప్రదర్శించిన నాటికలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రసఝరి పొన్నూరు వారి త్రిజుడు నాటిక, సద్గురు కళా నిలయం గుంటూరు వారి కమనీయం నాటిక, ప్రియదర్శిని నెల్లూరు వాకి రౌతు నాటికలు చక్కని సందేశాన్ని అందిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. జానపద, కూచిపూడి నృత్య ప్రదర్శనలు బెన్‌హర్, బెల్లంకొండ వెంకట్ ఆలపించిన అభ్యుదయ గీతాలు ఆహుతులను అలరించాయి. సందే శాత్మక అంశాలతో బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ ద్వారా నిర్వహించిన తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవాలు తెనాలి ప్రాంతవాసులకు విలువలతో కూడిన సందేశాన్ని అందించాయనడంలో సందేహం లేదు.

ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు

గ్రూప్-1 మోడల్ ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలో ఉత్తీర్ణులైన ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు మోడల్ ఇంటర్వ్యూలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ (ఏపీ స్టడీ సర్కిల్) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. అభ్యర్థులకు ఈ నెల 15 నుంచి మౌఖిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. సరైన తర్ఫీదు ఇచ్చేందుకు ఏపీ స్టడీ సర్కిల్ ద్వారా అనుభవజ్ఞులైన ప్యానల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపింది. కుటుంబ వార్షిక ఆదాయం రూ.6లక్షల లోపు ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తారు. అభ్యర్థులు 13లోగా apstdc.apcfss.in పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

విశాలాంధ్ర ఉద్యోగికి పితృవియోగం

విశాలాంధ్ర-విజయవాడ: విశాలాంధ్ర సబ్ ఎడిటర్ ఎ.సురేశ్‌బాబు తండ్రి మోహన్‌రావు(74) ఆకస్మికంగా గురువారం రాత్రి మరణించారు. నగరంలోని విద్యాధరపురం సాయిబాబా ఆలయం వీధిలో నివాసం ఉంటున్న మోహన్‌రావు అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన కొద్దిసేపటికే మృతిచెందారు. మోహన్‌రావు భౌతికకాయానికి విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జనరల్ మేనేజర్ పి.హరినాథరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు, విశాలాంధ్ర ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి మోదుమూడి మురళీకృష్ణ, స్టేట్ బ్యూరో ఇన్‌చార్జి చావా రవి, మేనేజర్ సూర్యనారాయణ, ఉద్యోగులు శుక్రవారం ఉదయం నివాళి అర్పించారు. సురేశ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సీపీఐ సభ్యురాలు యడ్ల భారతమాత మృతి

విశాలాంధ్ర-విజయవాడ: భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి యడ్ల కృష్ణ కిషోర్ తల్లి, సీపీఐ సభ్యురాలు యడ్ల భారతమాత (72) శుక్రవారం ఉదయం తన స్వగృహంలో కన్నుమూశారు. కమ్యూనిస్టు పార్టీ నాయకుడు అయిన ఆమె భర్త నరసింహారావు 2008లో మృతిచెందారు. భారతమాత, నరసింహారావు దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు యడ్ల కృష్ణకిషోర్ విద్యార్థి దశ నుంచి కమ్యూనిస్టు పార్టీ భావజాలానికి ఆకర్షితుడు కావడానికి తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణం. భారతమాత భౌతికకాయం వద్ద సీపీఐ రాష్ట్ర నాయకుడు వై.చెంచయ్య, రైతు సంఘం నాయకుడు ఎం.రాజేంద్రప్రసాద్, సీపీఐ రాష్ట్ర కార్యాలయ సహాయ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, నాయకులు కొల్లిపాక శేషు తదితరులు నివాళి అర్పించారు. ఆమె అంత్యక్రియలు సాయంత్రం నిర్వహించారు.

సీపీఐ నేతల సంతాపం: భారతమాత మృతికి సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీవీ సత్యనారాయణమూర్తి, కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, అక్కినేని వనజ, రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ సంతాపం తెలిపారు. సీపీఐ ఎన్టీఆర్, కృష్ణా జిల్లా కార్యదర్శులు సీహెచ్ కోటేశ్వరరావు, నార్ల వెంకటేశ్వరరావు, విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్, అభ్యుదయ రచయితల సంఘ నాయకులు సంతాపం తెలిపారు.

కోనసీమ క్రాప్ హాలిడేకు వైసీపీనే కారణం: పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కోనసీమ క్రాప్ హాలిడేకు వైసీపీనే కారణమని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రైతుల క్రాప్ హాలీడే ప్రకటనతో రాత్రికి రాత్రే వారి ఖాతాల్లో రూ.139కోట్లు జమ చేస్తు న్నట్లు ప్రకటించారన్నారు. క్రాప్ హాలీడే ప్రకటించిన మండలాల్లో సాగు నీరు అందుబాటులో అనేక ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. రైతులపై వైసీపీ నేతలవి చౌకబారు విమర్శలనీ, ఏ సమస్య వచ్చినా రాజకీయ కోణంలో చూడడం తప్ప, వారికి సమస్యను పరిష్కరించే మనస్తత్వం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనసీమ రైతులకు జనసేన అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్లే రైతులు పంట విరామ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ధాన్యం అమ్మిన రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించడం లేదని, దాదాపు రూ.475 కోట్ల బకాయిలు ఉన్నాయని తెలిపారు.

అరెస్టులు అప్రజాస్వామికం: శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జగజ్జీవన్ విద్యుత్ పథకాన్ని ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని కోరుతూ ఇంధన శాఖ అధికారులకు వినతిపత్రం అందజేసేందుకు వెళ్లిన దళిత, ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేయడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో ఖండించారు. 200 యూనిట్లలోపు వినియోగించుకునే దళిత, గిరిజనులకు జగజ్జీవన్ విద్యుత్ పథకం కింద ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నారన్నారు. దళిత, గిరిజనులను పథకానికి దూరం చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, ఆదేశాలను వెనక్కు తీసుకోవాలని ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇందన శాఖ కార్యదర్శికి వినతిపత్రం అందజేయడానికి వెళ్లిన కేవీపీఎస్ నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు.

సమ్మె నోటీసుతో దిగొచ్చిన 'సిగ్మా'

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ బ్రేవరీజస్ కార్పొరేషన్‌లో రవాణా చేస్తున్న సిగ్మా కంపెనీ హమాలీల కూలీ రేట్లు పెంచకుండా జాప్యం చేస్తున్న వైఖరిపై ఏఐటీయూసీ అనుబంధ యూనియన్ ఈనెల 2న సమ్మె నోటీసు ఇవ్వగా కంపెనీ యాజమాన్యం దిగివచ్చింది. డిమాండ్లలో కొన్నింటి పరిష్కారానికి అంగీ కరించింది. సమ్మె నివారించేందుకు యాజమాన్యం శుక్రవారం కార్మిక సంఘాల నేతలతో చర్చలు నిర్వహించింది. జూలై 1న సంయుక్త సమావేశాన్ని నిర్వహించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందని యూనియన్ నాయకులు ఎస్.వెంకట సుబ్బయ్య, లోకేశ్వరరావు చెప్పారు. కంపెనీ ప్రతినిధి చౌహాన్, వేణుగోపాల్, కృష్ణ, గోపీ నాయుడు, ఉమామహేశ్వరరావు, తులసీరావు, స్టీఫెన్, నాగార్జున రెడ్డి, గోపాల్ నాయకుడు, చంద్రన్న, కొండలరావు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పెందుర్తి ఘటన దుర్మార్గం

అమరావతి బహుజన జేఏసీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ జిల్లా పెందుర్తి పరిధిలోని జుత్తాడలో వైసీపీ నాయకులపై సెక్షన్ 3 కేసు కోసం ఫిర్యాదు చేయగా, ఫిర్యాదు దారుడిని దళితుల చేత కొట్టించటం దుర్మార్గమైన చర్యని అమరావతి బహుజన జేఏసీ శుక్రవారం ఓ ప్రకటనలో ఖండించింది. ఎంతోమంది దళిత మేధావులు, చారిత్రక దళిత పోరాటాల ఫలితంగా 1989 అంటరాని కులాల అణచివేతల వ్యతిరేక చట్టం వచ్చిందని, దీనిని ప్రభుత్వం పూర్తిగా దుర్వినియోగం చేసిందని జేఏసీ అధ్యక్షులు పి.బాలకోటయ్య ప్రకటనలో పేర్కొన్నారు.

సంపాదకీయం

నిరసన గళమెత్తిన ముస్లింలు

మహమ్మద్ ప్రవక్తను కించపరిచే విధంగా బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి నూపుర్ శర్మ, దిల్లీ బీజేపీ అధికార ప్రతినిధి నవీన్ కుమార్ జిందాల్ నోరు పారేసుకున్నందుకు దేశం అంతా మూల్యం చెల్లించవలసి వస్తోంది. శుక్రవారం దిల్లీ, గుజరాత్, పశ్చిమ బెంగాల్, తెలంగాణలోని హైదరాబాద్‌లో, జార్ఖండ్ రాజధాని రాంచీలో, పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో, పంజాబ్‌లోని లుధి యానాలో, మహారాష్ట్రలోని నవీ ముంబైలో ముస్లింల ఆగ్రహం ఒక్కసారి పెల్లుబికింది. యోగీ ఆదిత్యనాథ్ ఏలుబడిలోని షహరాన్ పూర్, మొరాదాబాద్, ప్రయాగ్ రాజ్‌లోనూ ముస్లింల నిరసన వల్ల పరిస్థితి అదుపు తప్పింది. తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేస్తున్న వారిని కట్టడి చేయడం కోసం చాలా చోట్ల పోలీసులు బలప్రయోగానికి దిగవలసి వచ్చింది. దిల్లీలోని జామా మసీదు దేశంలోనే అతి పెద్ద మసీదు. అది శు క్రవారం నిరసనకు కేంద్రమైంది. నూపుర్ శర్మను అరెస్టు చేయాలని వివిధ చోట్ల నిరసనకు దిగిన ముస్లింలు కోరుతున్నారు. దోషులను అధికార పార్టీ వెనకేసుకొస్తోందన్న అభిప్రాయం కేవలం ముస్లింలలోనే కాకుండ మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత అంతకంతకూ విషమిస్తున్న విద్వేష ప్రచారాన్ని వ్యతిరేకిస్తున్న వారందరూ భావిస్తున్నారు. తామేమీ నిరసన తెలియజేయాలని పిలుపు ఇవ్వలేదని దిల్లీ జామా మసీదు ఇమాం అంటున్నారు. అది నిజమా కాదా అన్న విషయాన్ని పక్కన పెడ్తే ముస్లింల మనసుల్లో ఎంత ఆందోళన ఉందో దేశంలోని అనేక ప్రాంతాల్లో పెల్లుబికిన ఆగ్రహ జ్వాలలే నిరూపిస్తున్నాయి. ప్రయాగ్ రాజ్ ఉత్తరప్రదేశ్‌లోని పెద్ద నగరాల్లో ఒకటి. అక్కడ ఆందోళన కారులు రాళ్ళు విసిరారు. యోగీ పోలీసులు నిరసనకారుల మీద తమ ప్రతాపం చూపించారు. ముస్లింల మనోభావాలు దెబ్బ తిన్నాయని, ఇవి ఎప్పుడో భయంకరంగా బయట పడవచ్చునని కేంద్రంలోని మోదీ సర్కారు, ఉత్తరప్రదేశ్‌లోని యోగీ ఆదిత్యనాథ్ సర్కారు కూడా అంచనా వేయలేక పోవడం ఆశ్చర్యంగా ఉంది. కాన్పూర్‌లో వారం రోజులుగా కల్లోల పరిస్థితులు కొనసాగుతున్నాయి. హింసాకాండలో 40 మంది గాయపడ్డ తరవాత యోగీ ప్రభుత్వం ఎందుకు మేల్కొనలేదు అన్న ప్రశ్నకు సమాధానం చెప్పడం సులభమే. నూపుర్ శర్మ లాంటి వారు చిల్లర మల్లర వారని బీజేపీ వాదిస్తున్నా మోదీ పుణ్యమా అని బీజేపీలో ఉదారవాద అభిప్రాయాలకు తావే లేకుండా పోయింది. మత విద్వేషం భారీగా తలకెక్కింది. ఏలిన వారి మెప్పు పొందడానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు విద్వేష విష వమనాన్ని అలవాటుగా మార్చుకున్నారు. చిల్లర మల్లర, చిన్న వర్గం అనుకున్న వారే ఇవాళ బీజేపీలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు అనడం కన్నా విద్వేషం నింపడమే బీజేపీ విధానం అని అనేక సందర్భాలలో రుజువైంది.

నూపుర్ శర్మ, నవీన్ కుమార్ జిందాల్ చేసిన అనుచిత, రెచ్చగొట్టే వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ అవి చిల్లర మల్లర వ్యక్తులు చేసినవని తప్పించుకోవడానికి చూసింది. తమ పార్టీకి చిల్లరమల్లర వ్యక్తులను అధికార ప్రతినిధులుగా ఎలా నియమిస్తారో అంతుచిక్కదు. ప్రపంచంలోని అత్యంత పెద్ద రాజకీయ పార్టీ అని బోర విరుచుకు తిరిగే బీజేపీ చెప్తున్న సాకులలో కుటిలత్వం కుళ్ల కంపు దశదిశలా వ్యాపిస్తోంది. నూపుర్ శర్మ లాంటి విద్వేషం తలకెక్కిన అధికార ప్రతినిధుల అభ్యంతరకర వ్యాఖ్యల తరవాత దేశంలో ముస్లింలలో అంతర్గతంగా వ్యక్తం అవుతున్న అసమ్మతి శుక్రవారం ఒక్కసారి భగ్గుమంది. ఈ వ్యాఖ్యలు చేసిన కొద్ది రోజుల తరవాత ఇస్లామిక్ దేశాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ఖతర్, కువైత్, ఇరాన్ లాంటి దేశాలైతే భారత రాయబారులను పిలిపించి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. అతి చిన్న ఇస్లామిక్ దేశాలు కూడా భారత్ క్షమాపణ చెప్పాలని కోరాయి. విశ్వ గురువు కావాలనుకుంటున్న భారత్ ఈ దేశాల ఎదుట సాగిల పడాల్సి వచ్చింది. ఇంతటి అవమానం స్వతంత్ర భారత చరిత్రలో ఎన్నడూ లేదు. భారత ఉపరాష్ట్రపతి కువైత్‌లో పర్యటిస్తున్న సందర్భంగానే ఇస్లామిక్ దేశాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కువైత్ అధినేత మన ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు గౌరవార్థం ఏర్పాటు చేసిన మధ్యాహ్న విందు కూడా రద్దు చేసుకున్నారంటే వారిలో ఆగ్రహజ్వాల ఎంత తీవ్రంగా ఉందో తేలిపోతోంది. కానీ మోదీ సర్కారు ఈ పరిణామాలు ఎంత అల్లకల్లోల పరిస్థితులకు దారి తీస్తాయో అంచనా వేయడంలో విఫలమైంది. అందుకే నోరు పారేసుకున్న నూపుర్ శర్మను బీజేపీ ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరించింది. జిందాల్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. చట్ట ప్రకారం వారిని శిక్షించే ఉద్దేశమే మోదీ సర్కారుకు లేదు. అక్కడితో గొడవ సద్దు మణుగుతుందని బీజేపీ భావించింది. అయినా ఇస్లామిక్ దేశాలలో ప్రతికూలత ఏ మాత్రం తగ్గలేదు. ఒక దేశం తరవాత మరో దేశం భారత్‌ను బోనులో నిలబెట్టాయి. విచిత్రం ఏమిటంటే దుర్వ్యాఖ్యలు చేసింది బీజేపీ అధికార ప్రతినిధులైతే భారత్ క్షమాపణ చెప్పాలని ఈ దేశాలు కోరాయంటే అవి మహమ్మద్ ప్రవక్తను దూషించడాన్ని ఎంతటి మహాపచారంగా భావించాయో అర్థం అవుతోంది. ఇంత రగడ జరిగిన తరవాత పదిహేను రోజులకు బీజేపీ చేసిన నిర్వాకం ఏమిటంటే దిల్లీ పోలీసులు గురువారం నూపుర్ శర్మ, నవీన్ జిందాల్ మీద ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేశారు. మరో అడుగు ముందుకేసి లోకసభలో మజ్లిస్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ, పత్రికా రచయిత్రి సబా నక్వీ మీద కూడా కేసు నమోదు చేశారు. వీరు జనం మధ్య చిచ్చు రేపుతున్నారన్నది ఆరోపణ. మరి నూపుర్ శర్మ, నవీన్ జిందాల్ చేసిన పనేమిటో? ఒక మత వర్గం అత్యంత గౌరవంగా చూసే మహమ్మద్ ప్రవక్త మీద అవాకులు చెవాకులు పేలడాన్ని నిరసించడం చిచ్చు రేపడం అనడం కేవలం వితండ వాదమే. అలాగైతే ఈ దేశంలోని ఉదారవాదులు, ప్రజాస్వామ్య వాదులందరి మీద కేసులు మోపవలసి వస్తుంది. ఇందులోనే విద్వేషం రెచ్చగొట్టడంలో బీజేపీ వక్ర బుద్ధి ఏమిటో రుజువు అవుతోంది. శుక్రవారం నిరసనకు దిగిన వారందరూ కోరుతున్నదల్లా నూపుర్ శర్మ, నవీన్ జిందాల్ మీద చట్ట ప్రకారం చర్య తీసుకోవాలనే. వారు బీజేపీ నాయకులు కాకుండా మరెవరైనా అయితే ఈ పాటికి వారి మీద దేశద్రోహులు అన్న ముద్ర వేసి జైలులో వేసేవారేగా! అదే పని తమ పార్టీ నాయకులు చేస్తే వారిని పదిహేను రోజులైనా అరెస్టు చేయకుండా ఉండడమే విద్వేష ప్రచారానికి బీజేపీ ఎలా తెగబడ్తోందో తేలిపోతోంది. ఆర్.ఎస్.ఎస్ అధినేత మాటలన్నీ పూత మెరుగులేననీ పంచతంత్ర కథల్లో పిల్లి చాంద్రాయణ వ్రతం చేసి శాకాహారిగా మారడంలాంటి పచ్చి మోసమేననీ ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. సంఘ పరివార్ ఎజెండాను అమలు చేయడానికి మోదీ కంకణం కట్టుకున్నారని ప్రత్యేకంగా నిరూపించవలసిన అగత్యమే లేదు. తమ ఎజెండాను మోదీ పకడ్బందీగా అమలు చేస్తున్నారు కనకే ఆయనను సంఘ్ పరివార్ అధినాయకులు ప్రోత్సహిస్తున్నారు. మహమ్మద్ ప్రవక్త మీద అనుచిత వ్యాఖ్యలు దేశమతా కల్లోలం రేపితే, ముస్లింల నిరసన పెడదారి పడ్తే దానికి పూర్తి బాధ్యత మోదీ సర్కారుదే.

కార్పొరేట్ కాలేజీల గోల



పరీక్షలు పూర్తి అయ్యాయి. ఫలితాలు వచ్చేసాయి. ఇక ఇప్పుడు ప్రారంభమైంది కార్పొరేట్ కాలేజీల పోటాపోటీ పరీక్షలు. రెండేళ్ల కరోనా అనంతరం విద్యా వ్యాపారం మందగించిన ఈ క్షణాన మళ్లీ కార్పొరేట్ కాలేజీలు తమ పాత ప్రతాపాన్ని చూపించేందుకు తరుణం సిద్ధమైంది. ర్యాంకుల గోల వద్దని, అలా ప్రకటించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఏపీ ప్రభుత్వం చేసిన ప్రకటనతో పేజీలు కొద్దీ ప్రకటనలు, టీవీ ఛానెళ్లలో ఊకదంపుడుగా వచ్చే ఒకటి, రెండు, మూడు ర్యాంకులు మా సొంతం అంటూ చేసే హడావుడి కాసింత తగ్గింది. అయితే, అంతర్గతంగా మాత్రం కార్పొరేట్ తీతువులు తమ అరుపులు ఎప్పటిలా కాకపోయినా కాసింత తక్కువగానే కూస్తున్నాయి.

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

తెలంగాణలో పదవ తరగతి పరీక్షల ఫలితాలు రాకపోవడంతో ఈ హడావుడి కాసింత తక్కువగానే ఉన్నా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఆ ఊపు జోరుగానే ఉంది. తలిదండ్రుల ఇల్లు, జేబులు గుల్ల చేసేందుకు ఈ కళా శాలలు వివిధ మారుపేర్లతో దోపిడీకి తలుపులు తెరిచాయి. ఇది ప్రతి ఏటా జరుగుతూన్న పరిణామమే అయినా ఈ సారి దీని ప్రభావం మాత్రం తలిదండ్రుల మీద చాలా తీవ్రంగానే పడుతోంది.

ఏపీలో గతంలో ఎన్నడూ లేని విధంగా పదవ తరగతి ఫలితాల విడు దల కూడా రాజకీయ వివాదం కావడం ఇక్కడి ప్రజలు చేసుకున్న పాపంలాగే ఉంది. విద్యార్థుల ఫలితాల విడుదలలో అన్యాయం జరిగిందంటూ ప్రతి పక్షాలు వివాదం చేయడం గతంలో ఎప్పుడైనా విన్నామా... కన్నామా. మాయదారి కాలంలో మాత్రమే ఇలాంటి విపరీత ధోరణులు వెలుగులోకి వస్తాయి. రెండేళ్ల కరోనా కఠిన పరిస్థితులు విద్యార్థుల భవితవ్యాన్ని కకా వికలం చేసాయి. ఆన్‌లైన్ క్లాసులంటూ వారికి అర్థం కాని విధంగా పాఠాలు చెప్పిన టీచర్లు, ఇంతటి సంక్షోభాన్ని కూడా పట్టించుకోకుండా ముక్కుపిండి ఫీజులు వసూలు చేసిన కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు మాత్రం గతంలోలాగే ఉన్నారు. ప్రభుత్వాలు కూడా విద్యావిధానంపై సరైన దిశా నిర్దేశం చేయకుండా కాలయాపనం చేయడం తెలుగు విద్యార్థులు, వారి తలిదండ్రులు చేసుకున్న ఖర్మగానే కనపడుతోంది.

ఒకవైపు ఈ ప్రహసనం నడుస్తూంటే అధికార, ప్రతిపక్ష ప్రజా నాయ కులు ఆన్‌లైన్‌లో కూడా ఒకరిపై ఒకరు అర్థం లేని ఆరోపణలు, విమర్శలు చేసుకుంటూ విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకోవాలనుకోవడం చూస్తూంటే మనం ఎక్కడున్నామో... ఎలా జీవిస్తున్నామో అర్థం కాని పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఫీజుల నియంత్రణపై దృష్టి పెట్టని ప్రభుత్వాలు ప్రజలపై విద్య పేరుతో జరుగుతున్న దాడిని చూస్తూ ఊరుకోవడం నానాటికి పెరుగుతోందే తప్ప తరుగుతున్న ఆశలు ఎక్కడా కానరాడం లేదు. కార్పొరేట్ కాలేజీల కంబంధ హస్తాల్లో పిల్లల భవిష్యత్ నలిగిపోతూంటే.. తల్లిదండ్రులు ఫీజుల కోసం ఇల్లు, వొళ్లూ గుల్ల చేసుకోవడం బహుశా మన తెలుగు రాష్ట్రాలలో తప్ప మరింకెక్కడా కనపడదేమో. ఈ విద్యా ఉన్మాదాన్ని అరికట్టేందుకు ఎవరు ముందుకు రావాలో... ఎవరు వస్తారో అని ఎదురు చూడడమో... శ్రీశ్రీ అన్నట్లు ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూసి సంవత్సరాల తరబడి మోసపోవడం వినా ఇంకేం చేయలేని అసమర్థులుగా మిగిలిపోవడమో....

వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్, 9912019929

మళ్లీ మహమ్మారి అలజడి



ప్రస్తుత పరిస్థితిని పరిశీలిస్తే ఇది మినీ వేవ్‌గా (స్వల్ప దశ) భావించవచ్చునని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డా॥సౌమ్యస్వామినాథన్ అభిప్రాయపడ్డారు. అలాగే ఒమి క్రాన్ బిఏ1 కంటె ప్రస్తుతం వస్తున్న ఉపరకాలు వేగంగా ఒకరి నుంచి మరొకరికి విస్తరిస్తున్నాయని కూడా ఆమె తెలి పారు. దీని అర్థం వేగంగా రోగనిరోధకశక్తి తగ్గిపోతుందని ఆమె చెప్తున్నారు. ప్రతి నాలుగు నెలలకు లేదా ఆరు నెలలకు ఒకసారి మినీ వేవ్ వచ్చే అవకాశాలున్నాయిని ఆమె అంచనా నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలను ప్రజలు ఎప్పటికప్పుడు తీసుకోవలసిందేనని అర్థం అవుతోంది.

దాదాపు రెండేళ్లు ప్రపంచాన్ని వణికించి కోటిన్నర మందికి పైగా ప్రాణాలు హరించిన కోవిడ్-19 మహమ్మారి కొత్త రకాలు మళ్లీ మన దేశంలోనూ అలజడి సృష్టిస్తున్నాయి. దాదాపు పది నెలలుగా ఈ మహమ్మారి పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో ప్రజలలో దీని పట్ల భీతి పూర్తిగా పోయింది. ఈ దశలో దేశంలో ముఖ్యంగా మహారాష్ట్ర, కేరళ, దిల్లీ, కర్నాటక రాష్ట్రాల్లో మహమ్మారి ప్రభావం చూపుతోంది. మహారాష్ట్రలో కోవిడ్ నాల్గవ దశలో ప్రవేశించిందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం విమానాల్లో ప్రయాణీకులు తప్పనిసరిగా మాస్కులు ధరించాలన్న షరతు పెట్టింది. దీనిపై ప్రయాణీకుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మహారాష్ట్రలో మే 23-29 తేదీల మధ్య వారం రోజుల్లో 130 శాతం, ముంబయిలో 135 శాతం ఇన్ఫెక్షన్ కేసులు నమోదయ్యాయి. అలాగే మే 30- జూన్ 5 మధ్యలో 130.84 శాతానికి పెరిగాయి. రోజురోజుకీ కేసులు అధికమవుతున్నాయి. శుక్రవారం (10వ తేది) నాటికి రోజువారీ ఇన్ఫెక్షన్ కేసులు 7,584కు చేరాయని అధికారిక సమాచారం తెలియజేస్తోంది. మే 31న రోజువారీ కేసులు 2,663 ఉండగా అవి వారంలో రెట్టింపు అయి 7,230 గా నమోదయ్యాయి. అంటే కేసులు వేగంగానే పెరుగుతున్నాయి. అయితే ఆస్పత్రిలో చేరి చికిత్స చేయించుకుంటున్న వాళ్ల సంఖ్య స్వల్పంగానే ఉంది. అలాగే మృతుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఇదొక సానుకూల అంశం. అయితే రోజువారీ నమోదవుతున్న ఇన్ఫెక్షన్ కేసులు 2.26 శాతం ఉన్నాయని అధికారిక సమాచారం. మొత్తం కేసుల్లో మహారాష్ట్ర, కేరళలోనే 70 శాతం ఉన్నాయి. రోజు వారీ పరీక్షలు చేయించుకుంటున్న వారి శాతం కొంచెం పెరిగి 2.3 శాతానికి చేరింది. ఈ ఏడాది ఫిబ్రవరి తర్వాత ఇదే అధికం.

రెండు రోజుల క్రితం వరకు వైద్య చికిత్స చేయించుకుంటున్న కేసులు కేరళలో 8,290, మహారాష్ట్రలో 5,888, కర్నాటకలో 2,260, దిల్లీలో 1,467, ఉత్తరప్రదేశ్ 911, తమిళనాడు 799, తెలంగాణ 547, రాజస్థాన్ 411, పశ్చిమ బెంగాల్ 376, గుజరాత్ 293, మధ్యప్రదేశ్ 253, పంజాబ్ 127, ఒడిషా 124 ఉండగా ప్రధాన రాష్ట్రాలన్నిటికెల్లా ఆంధ్రప్రదేశ్‌లో అతి తక్కువగా 61 కేసులే ఉన్నాయి. కొత్తగా కేసులు నమోదైనట్టుగా సమాచారం లేదు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ మహారాష్ట్రతో సహా కేరళ, తమిళనాడు, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఆదే సమయంలో కేంద్ర ఆరోగ్య శాఖ తీసుకోనున్న చర్యలు లేదా ప్రణాళికను ఏమీ ప్రకటించలేదు. మొదటి, రెండో దశల్లో కేంద్ర ప్రభుత్వం మహమ్మారి విజృంభించినప్పటికి సకాలంలో తగు చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్న విమర్శలను ఇంటా బయటా ఎదుర్కొన్నది. మూడు వారాల్లో అదుపు చేస్తానని, దీపాలు వెలిగించండి, చప్పట్లు కొట్టండని దేశ ప్రజలకు పిలుపునిచ్చిన ప్రధాని అపహాస్యం పాలయ్యారు. మహమ్మారి కేసుల చికిత్స కోసం ఆరోగ్య వ్యవస్థను సిద్ధం చేయడం, సౌకర్యాల కల్పనలోనూ కేంద్ర ప్రభుత్వం విదేశాల్లోనూ విమర్శలను ఎదుర్కొన్నది.

ఒమిక్రాన్ రకం వల్ల మూడో దశ వచ్చిందని అప్రమత్తంగా ఉండాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలని కేంద్రం ఆదేశించింది. రాష్ట్రాలు తగిన ఏర్పాట్లు చేసు కొని వాక్సిన్ రెండు డోస్‌లు వేయించుకొన్న పెద్దవాళ్లకు, ఆ తర్వాత 40-60 ఏళ్ల మధ్య వయస్కులకు బూస్టర్ డోస్‌లు వేశారు. ఆ తర్వాత యువతకు దాదాపు పూర్తిగా ఒక డోస్, సగానికి పైగా రెండు డోస్‌లు వేసినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఒమిక్రాన్ భయపడినంతగా ప్రజలను పెద్దగా ఇబ్బంది పెట్టలేదు. అయితే కోవిడ్ మహమ్మారి సోకి వైద్య చికిత్స పొంది స్వస్థత చేకూరినవారికి అనేక రకాల రుగ్మతలు కలిగాయి. ఇప్పుడు ఒమిక్రాన్ పరివర్తిత ఉపరకాల కేసులు కొన్ని రాష్ట్రాలకే పరిమితమయ్యాయి. ఆయా రాష్ట్రాల్లో కేసుల నమోదు వాటి ప్రభావాన్ని అంచనా వేసి తగు జాగ్రత్తలు తీసుకోవలసిన బాధ్యత ప్రభుత్వాలు, అధికార యంత్రాంగానికి ఉంది. ప్రజలు సైతం అప్రమత్తులై మాస్కులు ధరించడం, ఎక్కువ గుమిగూడకుండా ఉండడం లాంటి చర్యలు తీసుకుని ఈ మహమ్మారి బారిన మరోసారి పడకుండా చూసుకోవాలి. బూస్టర్ డోస్‌ల కోసం వచ్చే వాళ్లు తక్కువగా ఉన్నారు. కొత్త పరిణామాల పట్ల వారిని అప్రమత్తం చేసి అవసరమైనన్ని వాక్సిన్‌లు సరఫరా చేయాలి. నాలగవ దశలోకి ఈ మహమ్మారి ప్రవేశిస్తుందా అనేది కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటిస్తుంది. బూస్టర్ డోస్‌లు వేయించుకున్న వారి సంఖ్య కేవలం 3 శాతమే ఉంది. రెండు డోస్‌లు వేయించుకున్న వారు 69 శాతం ఉన్నారు.

ప్రస్తుత పరిస్థితిని పరిశీలిస్తే ఇది మినీ వేవ్‌గా (స్వల్ప దశ) భావించ వచ్చునని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డా॥ సౌమ్య స్వామినాథన్ అభిప్రాయపడ్డారు. అలాగే ఒమిక్రాన్ బిఏ1 కంటె ప్రస్తుతం వస్తున్న ఉప రకాలు వేగంగా ఒకరి నుంచి మరొకరికి విస్తరిస్తున్నాయని కూడా ఆమె తెలిపారు. దీని అర్థం వేగంగా రోగ నిరోధకశక్తి తగ్గిపోతుందని ఆమె చెప్తున్నారు. ప్రతి నాలుగు నెలలకు లేదా ఆరు నెలలకు ఒకసారి మినీ వేవ్ వచ్చే అవకాశాలున్నాయిని ఆమె అంచనా నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలను ప్రజలు ఎప్పటికప్పుడు తీసుకోవలసిందేనని అర్థం అవుతోంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వేగంగా విస్తరి స్తున్న ఇన్ఫెక్షన్ కేసుల నేపథ్యంలో పరీక్షల నిర్వహణ, బూస్టర్ డోస్‌ల అవ సరంపై ప్రజలను అప్రమత్తం కావించటం ముఖ్యం. అలాగే ఆస్పత్రులలో అవ సరమైనన్ని సదుపాయాలను కల్పించి ఇన్ఫెక్షన్ సోకిన వారికి చికిత్స చేసేందుకు అవసరమైన డాక్టర్లను, సిబ్బందిని సంసిద్ధంగా ఉంచటం కూడా అవసరమే. ఆంధ్రప్రదేశ్ లాంటి చోట కొత్త కేసులు నమోదు కాకపోయినప్పటికీ ప్రజలను అప్రమత్తంగా ఉంచటం అవసరం. ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చే ప్రయాణీకులకు కనీస పరీక్షలు నిర్వహించటం ముందు జాగ్రత్తల్లో భాగంగా పరిగణించవచ్చు.

- ఎడిట్ పేజీ డెస్క్

ఏం కొనేటట్టు లేదు... ఏం తినేటట్టు లేదు!

మన దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు మండిపోతున్నాయి. ఈ విషయంలో తెలుగు రాష్ట్రాల పరిస్థితీ దారుణంగా ఉంది. సామాన్య ప్రజలు ముఖ్యంగా పేద, మధ్య తరగతి, బడుగు, బలహీన వర్గాల వారు అందుబాటులో లేని నిత్యావసర వస్తువుల ధరలతో అల్లాడుతున్నారు. బియ్యం, కూరగాయలు, ఆకుకూరలు, గ్యాస్ సిలిండర్లు, పెట్రోలు, డీసెల్ తదితరాలన్నీ భగభగలాడుతున్నా పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నింగినంటుతున్న ధరలను నేలకు లాక్కొచ్చేందుకు ప్రభుత్వ పెద్దలు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం శోచనీయం. అంతకంతకూ హెచ్చుతూనే ఉన్న ధరలను చోద్యంలా చూస్తున్నారు. రెక్కాడితేగాని డొక్క నిండని బడుగు జీవులు చేతికందని నిత్యావసర వస్తువుల ధరలతో సతమతమవుతున్నారు. ఏం కొనేటట్టు లేదు, ఏం తినేటట్టు లేదని వాపోతున్నారు. ఎంత కష్టపడినా వచ్చే రూపాయలతో నిత్యావసరాలూ కొనలేని దుస్థితి నెలకొందని ఆవేదన పడుతున్నారు. కూరగాయలు టమాట కిలో వంద రూపాయల పైనే. ఆలుగడ్డ, బీన్స్, చిక్కుడు కాయలు, ఆకుకూరల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఉచిత పథకాలను ప్రవేశపెట్టి కోట్ల రూపాయలను బూడిదలో పోసిన పన్నీరుగా మారుస్తున్నారని ఉచిత పథకాలు పేద ప్రజలకు చేరడం లేదనే విషయాన్ని నాయకులు గుర్తించాలని కోరుతున్నారు. ఏవేవో పథకాలు ప్రవేశపెట్టి ప్రచారం చేసుకోవడం కాదు నిత్యావసర వస్తువుల ధరలు దించండి అని బడుగు జీవులంతా మొరపెట్టుకుంటున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు అందరికీ అందుబాటులో ఉండేటట్లు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని గుర్తు చేస్తున్నారు. కరోనా కారణంగా రెండేళ్ళుగా గ్రామాల్లో ఉంటున్న ఉంటున్న వలస కూలీలూ ఇప్పుడిప్పుడే తిరిగి నగరాలకు చేరుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితిలో నిత్యావసరాల ధరలు పెరగడం వారి జీవితాలకు పెద్ద దెబ్బే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యులు ముఖ్యంగా పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిత్యావసర వస్తువుల ధరలు, కూర గాయల ధరల తగ్గింపుపై దృష్టి సారిం చాలి. వీటికి తోడు తెలుగు రాష్ట్రాల్లో బస్సు ఛార్జీలూ పెరిగిపోయి ప్రజా రవాణా కూడా కష్టంగా మారింది. బస్సు టిక్కెట్లే కాదు రైల్వే టిక్కెట్ల రేట్లూ గతంతో పోల్చుకుంటే రెట్టింపు కావ డంతో ప్రయాణికులు అనేక ఇబ్బందు లను ఎదుర్కొంటున్నారు. బస్సుల్లో, రైళ్ళల్లో ప్రయాణం చేయాలంటేనే భయ పడుతున్నారు. ఇక ఆటో డ్రైవర్లు ప్రయా ణికుల నుంచి అధిక మొత్తంలో వసూలు చేసినా అడిగే నాథుడే లేడు. రాత్రి సమయంలో ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ఆటోలపై ఆధారపడవలసి వస్తున్నదని ఆటోడ్రైవర్‌ల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని కార్మికులు, కూలీలు చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు ప్రజల ఇబ్బందులను పట్టించుకోవాలి, ధరలను తగ్గించి వారి పొట్ట నిండే మార్గం చూపించాలి.

డాక్టర్. ఎస్. విజయ భాస్కర్, 9290826988

పంజాబ్‌లో వేర్పాటువాద కలకలం

ఐ. ప్రసాదరావు

ఇటీవల కాలంలో ఇతర దేశాల్లో ఉన్న అనేక మంది ఖలిస్తాన్ నాయకులు, డ్రగ్స్ మాఫియా, వేర్పాటువాద సంస్థలు తిరిగి పంజాబ్‌లో ఖలిస్తాన్ సాధనకు స్థానిక ముఠాలతో చేతులు కలిపి అరాచకాలు సృష్టిస్తూ ప్రస్తుత ఆప్ ప్రభుత్వానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పెను సవాలు విసురుతున్నాయి. గత నెల మే 8, 9 తేదీల్లో జరిగిన దాడులు, ఇటీవల సెలబ్రిటీ హత్య, ఆర్.డి.యక్స్ పట్టివేత, విపరీతంగా పాక్ డ్రోన్స్, ఉగ్రవాద సంస్థలు, వ్యక్తులు ద్వారా మత్తు మందులు (డ్రగ్స్), ఆయుధాలు పంజాబ్‌కు తరలించడం కలకలం సృష్టించాయి. పదుల సంఖ్యలో ఖలిస్తాన్ సంస్థలు, విదేశాలు ముఖ్యంగా కెనడా, అమెరికా, రష్యా, పాకిస్థాన్ నుంచి వివిధ రకాల సహాయ సహకారాలు అందించుట ద్వారా పంజాబ్‌లో అస్థిరత్వానికి కారణం అవుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఆప్ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం చాలా అప్రమత్తంగా ఉండవలసిన పరిస్థితి ఏర్పడింది.

ప్రశాంతంగా ఉన్న పంజాబ్ రాష్ట్రంలో మళ్ళీ వేర్పాటు వాదం పొడసూపుతోంది. ముఖ్యంగా సంవత్సర కాలం నుంచి ఖలిస్తాన్ రూపంలో వేర్పాటు వాదం అలజడి రేపుతున్నది. మాఫియా, అంతర్గత ముఠాల దాడులు, మత్తు మందు ఇలా అనేక రకాల అసాంఘిక శక్తుల కార్యకలాపాలకు కేరాఫ్ అడ్రస్‌గా పంజాబ్ రాష్ట్రం వార్తల్లో ఉంటోంది. ముఖ్యంగా నూత నంగా అధికారానికి వచ్చిన ఆప్ ప్రభుత్వానికి అగ్ని పరీక్షగా మారనుంది. ఈ పరిస్థితుల్లో కొత్త ప్రభుత్వం నిర్దిష్టమైన ప్రణా ళికతో కఠిన చర్యలు తీసుకోవాలి. పరిస్థితిని అదుపులో ఉంచు కుంటూ, మెరుగైన పాలన అందిస్తూ పురోగామి పంజాబ్‌గా తీర్చిదిద్దాలి. అవసరమైన సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వం కూడా తగిన సహాయం అందించాలి. ఎందుచేతనంటే దేశ భద్రత కూడా పంజాబ్ రాష్ట్రంతో ముడిపడి ఉన్నది. మన దేశ సరిహద్దు పంజాబ్ రాష్ట్రం పాకిస్తాన్‌తో సుమారు 553 కి.మీ. పంచు కుంటోంది.

దేశానికి స్వాతంత్ర్యం రాకముందే 1946లోనే సిక్కులు ప్రత్యేక దేశం కావాలని ఉద్యమాన్ని చేశారు. తరవాత క్రమంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ ఉద్యమాన్ని బలహీన పరిచి, సుస్థిర పాలన అందించాయి. 1972 నుంచి 1984 మధ్య కాలంలో ఖలిస్తాన్ వేర్పాటు వాదం తారాస్థాయికి చేరింది. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ సాహసోపేతమైన నిర్ణయం "బ్లూ స్టార్ ఆపరేషన్" ద్వారా వేర్పాటు వాదులను, ఉగ్రవాదులను ముఖ్యంగా బింద్రన్ వాలేను మట్టుపెట్టుట ద్వారా ఉగ్రవాదానికి, ఖలిస్తాన్ ఉద్య మానికి చెక్ పెట్టారు. ఈ కారణంగానే తదనంతర కాలంలో శ్రీమతి ఇందిరాగాంధీ ఉగ్రవాద దాడులకు బలయ్యారు. ఇటీవల కాలంలో ఇతర దేశాల్లో ఉన్న అనేకమంది ఖలిస్తాన్ నాయకులు, డ్రగ్స్ మాఫియా, వేర్పాటువాద సంస్థలు తిరిగి పంజాబ్‌లో ఖలిస్తాన్ సాధనకు స్థానిక ముఠాలతో చేతులు కలిపి అరాచకాలు సృష్టిస్తూ ప్రస్తుత ఆప్ ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పెను సవాలు విసురుతున్నాయి. గత నెల మే 8, 9 తేదీల్లో జరిగిన దాడులు, ఇటీవల సెలబ్రిటీ హత్య, ఆర్.డి.యక్స్ పట్టివేత, విపరీతంగా పాక్ డ్రోన్స్, ఉగ్రవాద సంస్థలు, వ్యక్తులు ద్వారా మత్తు మందులు (డ్రగ్స్), ఆయుధాలు పంజాబ్‌కు తరలించడం కలకలం సృష్టించాయి. పదుల సంఖ్యలో ఖలిస్తాన్ సంస్థలు, విదేశాలు ముఖ్యంగా కెనడా, అమెరికా, రష్యా, పాకి స్థాన్ నుంచి వివిధ రకాల సహాయ సహకారాలు అందించుట ద్వారా పంజాబ్‌లో అస్థిరత్వానికి కారణం అవుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఆప్ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం చాలా అప్రమత్తంగా ఉండవలసిన పరిస్థితి ఏర్పడింది.

సరిహద్దు రాష్ట్రం హిమాచల్ ప్రదేశ్ శాసనసభ గోడలపై ఖలిస్తాన్ రాతలు, జెండాలు ఎగురవేసిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా ఈ ఖలిస్తాన్ ఉద్యమం వెనుక ఐ.యస్. (ఐసీస్) హస్తం దండిగా ఉన్నది. సిక్కు జాతీయ వాదాన్ని, ప్రత్యేక దేశ ఏర్పాటు వాదాన్ని బలంగా ముందుకు తీసుకురావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర భద్రతకు మెరుగైన చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఇటీవల సెలబ్రిటీలు, ప్రధాన నాయకుల భద్రత ఉపసంహరణ నిర్ణయం సమీక్ష చేసుకోవాలి. కనీసం పరిస్థితి అదుపులోకి వచ్చేవరకూ ఆచితూచి అడుగులు వేయాలి అని పలువురు సూచిస్తున్నారు. సరిహద్దు వెంబడి నిఘా పెంచాలి. ముఖ్యంగా స్థానిక ముఠాలకు ఉత్తరప్రదేశ్, బిహార్, సరిహద్దు దేశాలు, ఇతర దేశాల నుంచి ఆర్థిక, ఆయుధ సహకారం లేకుండా చూడాలి. ఇంటిలిజెన్స్, పోలీస్, విదేశీ వ్యవహారాలు, రక్షణ శాఖలు సహాయ సహకారాలు, సలహాలు సూచనలు తీసు కుంటూ రాష్ట్ర ప్రజల రక్షణ భద్రతకు భరోసా కల్పిం చేందుకు కృషి చేయాలి. డ్రగ్స్ మాఫియాపై నిఘా పెంచాలి. దోషులను కఠినంగా శిక్షించాలి. ఆధునిక పరిజ్ఞానం ఆర్టిఫిషి యల్ ఇంటి లిజెన్స్ రోబోటిక్స్ సహకారంతో అక్రమాలకు అడ్డు కట్ట వేయాలి. "పంజాబ్ అంటే దేశానికి ఒక గొప్ప శక్తి" అనే భరోసా కల్పించేం దుకు కృషి చేయాలి. పంజాబ్‌లో ఇప్పటికే ఉన్న డ్రగ్స్, నీటి, వ్యవసాయ, నిరుద్యోగం, కాలుష్యం సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. దేశ అస్థిరతకు కారణమయ్యే ఏ శక్తినైనా కూకటివేళ్లతో పెకలించి, పంజాబ్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే దిశగా ప్రస్తుత ఆప్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం పని చేయాలి.

వ్యాస రచయిత సెల్ 6305682733

ప్రవేశాల ప్రక్రియ అంతులేనిది కాదు

నర్సింగ్ కోర్సుల భర్తీపై సుప్రీం

న్యూదిల్లీ : విద్యా సంస్థల్లో ప్రవేశాల ప్రక్రియ అంతులేని కాదని, నిర్దిష్ట సమయంలో ముగియాల్సిందేనని సుప్రీం కోర్టు శుక్రవారం స్పష్టం చేసింది. 2021-22 విద్యా సంవత్సరానికి దిల్లీలోని నర్సింగ్ కోర్సులలో సీట్ల భర్తీకి అదనపు మాప్-అప్ రౌండ్ నిర్వహించాలని కేంద్రాన్ని, ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌ను ఆదేశించడానికి సుప్రీం కోర్టు శుక్రవారం నిరాకరించింది. దిల్లీ నర్సింగ్ విద్యాసంస్థల్లో దాదాపు 110 సీట్లు ఖాళీగా ఉన్నందున 2021-22 నర్సింగ్ కోర్సుల కోసం మరో అదనపు మాప్ అప్ రౌండ్‌ను అనుమతించడం ద్వారా ప్రవేశాల ప్రక్రియను ప్రారంభించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ సెయింట్ స్టీఫెన్స్ హాస్పిటల్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, ఏంజెలా బిజూ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తులు ఎంఆర్ షా, అనిరుధ్ బోసలతో కూడిన వెకేషన్ బెంచ్ తోసిపుచ్చింది. 2021-22 విద్యా సంవత్సరం కోసం దిల్లీలోని నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశ ప్రక్రియ మార్చి 31, 2022న ముగిసింది. కాగా రెండు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల కాల షెడ్యూల్‌ను మార్చి 31 నుంచి మే 15 వరకు పొడిగించారని, అందుకే సెయింట్ స్టీఫెన్స్ హాస్పిటల్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌కి కూడా అలాంటి ఉపశమనం కల్పించవచ్చని పిటిషన్లు ఆరోపించాయి. 'విద్యా సంస్థల్లో ప్రవేశ ప్రక్రియ అంతులేనిది కాదు. అది ఒక నిర్దిష్ట సమయంలో ముగియాలి. సమయ షెడ్యూల్‌లో పొడిగింపు లేదా వ్యత్యాసం అంతిమంగా విద్యను ప్రభావితం చేయవచ్చు. ఇటువంటి పరిస్థితుల్లో దిల్లీ హైకోర్టు ఆమోదించిన తీర్పు, ఆర్డర్‌లో జోక్యం చేసుకోవడానికి మాకు ఎటువంటి కారణం కనిపించదు. ఎస్ఎల్‌పీ (స్పెషల్ లీవ్ పిటిషన్‌లు) రెండూ కొట్టివేస్తున్నాం' అని బెంచ్ స్పష్టం చేసింది. సంక్షిప్త విచారణ సందర్భంగా మహమ్మారి సమయంలో మానవ వనరుల కొరతను భావించిన దిల్లీలోని దాదాపు 110 నర్సింగ్ సీట్లు ఖాళీగా ఉన్నాయని కోరారు. 'ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ జారీ చేసిన నోటిఫికేషన్ నుంచి 2021-22 విద్యా సంవత్సరానికి ప్రవేశాల చివరి తేదీ మార్చి 31, 2022. దాని ప్రకారం, విద్యా సంస్థల్లో ప్రవేశానికి సమయ షెడ్యూల్‌కు కట్టుబడి ఉండాలి. అందువల్ల హైకోర్టు పిటిషన్‌ను స్వీకరించడానికి నిరాకరించింది. ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి తదుపరి మాప్ అప్ రౌండ్‌లో ఏదైనా ఉపశమనం ఇవ్వడానికి నిరాకరించింది' అని సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొంది. 'ఎలాంటి ప్రతికూల వివక్ష ఉండకూడదు. అన్ని ఇతర సంస్థలకు సంబంధించి మార్చి 31 కాల పరిమితి కట్టుబడి ఉంది. మే 15 తేదీ కూడా ముగిసింది' అని తెలిపింది. 2021-22 విద్యా సంవత్సరానికి దిల్లీ నర్సింగ్ కళాశాలల్లో ప్రవేశాల సమయాన్ని పొడిగించకూడదన్న దిల్లీ హైకోర్టు నిర్ణయానికి వ్యతిరేకంగా దాఖలయిన అప్పీళ్లను ధర్మాసనం విచారించింది.

శవాలను రోడ్లపై వదిలేయాలా?

- శ్మశానాలకు స్థలం కేటాయింపునకు 15రోజులే గడువు
- లేనిపక్షంలో రెవెన్యూశాఖ ప్రధాన కార్యదర్శికి జైలు తప్పదు
- కర్ణాటక ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టీకరణ

బెంగళూరు : శ్మశాన వాటికల కోసం భూములను కేటాయించడంలో కర్ణాటక ప్రభుత్వం విఫలం అవుతుండటాన్ని ఆ రాష్ట్ర హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. ప్రభుత్వ తీరును ఆక్షేపించింది. శ్మశానాలు లేకపోతే మృతదేహాలను రోడ్లపై వదిలేయాలా అంటూ అసహనం వ్యక్తంచేసింది. ప్రభుత్వం చేసే పనిని కోర్టు చేయాల్సి రావడం దురదృష్టకరమని కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ బి.వీరప్ప ధర్మాసనం వ్యాఖ్యానించింది. శ్మశానాల కేటాయింపుపై నిర్లక్ష్యానికి సిగ్గుపడాలని రాష్ట్ర ప్రభుత్వానికి చీవాట్లు పెట్టింది. శ్మశానాలు లేని గ్రామాలు, పట్టణాల్లో 15 రోజుల్లోగా వాటి కోసం భూమిని కేటాయించకపోతే కోర్టు ధిక్కరణగా పరిగణించి రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శిని జైలుకు పంపుతామని న్యాయస్థానం తేల్చిచెప్పింది. 2019లో పిటిషనర్ మహమ్మద్ ఇక్బాల్ ఫిర్యాదు మేరకు శ్మశానాలు లేని గ్రామాలకు ఆరు వారాల్లోగా భూములు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కానీ నేటికీ అవి ఆచరణకు నోచుకోలేదు. దీంతో ఇక్బాల్ మరోమారు కోర్టును ఆశ్రయించారు. దీనిపై స్టేటస్ రిపోర్టు ఇచ్చేందుకు కొంత సమయం ఇవ్వాలని ప్రభుత్వం తరపు న్యాయవాది కోరగా ఇదేమైనా ఆచూకీ లేని వ్యక్తి వ్యవహారమా అని కోర్టు ప్రశ్నించింది. మంచి చేస్తే ప్రజలు ఓట్లు వేస్తారు. ఓట్లను సమకూర్చే చర్యల్లో భాగంగా శ్మశానాలకు భూములు ఇవ్వండి అని న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

చెట్ల మార్పిడితో పచ్చదనం యథాతథం

న్యూదిల్లీ: నగరంలో పెద్ద సంఖ్యలో అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టినా, తమ ప్రభుత్వ చెట్ల మార్పి విధానంతో దేశ రాజధానిలో పచ్చదనం తగ్గకుండా నిరోధించామని దిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం తెలిపారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దిల్లీలో పచ్చదనం 19.97 నుంచి 23.06 శాతానికి పెరిగిందన్నారు. మయూర్ విహార్‌లోని ఒక స్థలంలో నాటిన చెట్లను పరిశీలించిన తర్వాత, 'అభివృద్ధి పనులను పరిశీలిస్తే ఢిల్లీలో పచ్చదనం 15-16 శాతానికి తగ్గాలి.. కానీ అక్టోబర్ 2020లో తీసుకొచ్చిన ట్రీ ట్రాన్స్‌ప్లాంటేషన్ పాలసీ దానిని అడ్డుకుంది. 2011లో ఢిల్లీ పచ్చదనం (అటవీ, చెట్ల కవచం) 19.97. 2021లో 23.06 పెరిగింది, తాజా ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ నివేదిక ప్రకారం 'పర్యావరణాన్ని కాపాడటం పట్ల మా ప్రభుత్వం సున్నితంగా వ్యవహరిస్తోంది. ఏటా పెద్ద సంఖ్యలో మొక్కలు నాటుతున్నాం. చెట్ల మార్పిడి విధానం పెద్ద సంఖ్యలో చెట్లను కాపాడేందుకు దోహదపడింది. ఇలాంటి విధానాన్ని అమలు చేస్తున్న తొలి రాష్ట్రం దిల్లీ. మరే ఇతర రాష్ట్రం కూడా ఈ ప్రయత్నం చేయలేదు'' అని కేజ్రీవాల్ అన్నారు. ఈ విధానం అమలులోకి వచ్చిన తర్వాత నాటిన చెట్ల మనుగడ రేటు 30 శాతం నుంచి 54 శాతానికి పెరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

గ్రాండ్ ఛాలెంజ్ విసిరిన ఇంటెలిజెంట్ ఐఓటీ సెన్సార్

తిరువనంతపురం: స్మార్ట్ సిటీలు, రోబోటిక్స్, ఆటోమేషన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రంగాల్లో ఐఓటీ సెన్సార్స్‌ను ఉపయోగించేలా కొత్త ఆలోచనలు రూపొందించేందుకు ఇంటెలిజెంట్ ఐఓటీ సెన్సార్ గ్రాండ్ ఛాలెంజ్‌ను ప్రకటించింది. ఈ ఛాలెంజ్ దేశంలోనే మొట్టమొదటి ఆన్-క్యాంపస్ డిజిటల్ యూనివర్సిటీ అయిన కేరళ డిజిటల్ యూనివర్సిటీది. విజేతకు రూ. 15 లక్షల గ్రాంట్‌తో పాటు ఉత్పత్తి అభివృద్ధికి మరింత మద్దతునిచ్చేందుకు ఇంటెలిజెంట్ ఐఓటీ సెన్సార్ల కింద రెండేళ్లపాటు పనిచేసే అవకాశం కూడా అందించబడుతుందని డిజిటల్ యూనివర్సిటీ కేరళ తెలిపింది. వ్యూహాత్మక రంగాలలో ఐఓటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) సెన్సార్ టెక్నాలజీల పాత్రను గుర్తించడానికి, సెన్సార్ తయారీలో పరిశ్రమ పోకడలపై ఆలోచనలను చర్చించడానికి పరిశ్రమ వినియోగదారుల కోసం బుధవారం ఇక్కడ డిజిటల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఇంటెలిజెంట్ ఐఓటీ సెన్సార్స్ నిర్వహించిన వర్క్‌షాప్ సందర్భంగా గ్రాండ్ ఛాలెంజ్ ప్రకటించారు. గ్రాండ్ ఛాలెంజ్ అందరికీ అందుబాటులోనే ఉందని, స్టార్టప్‌లు, ఇన్నోవేటర్‌ల నుంచి విద్యార్థుల వరకు ఎవరైనా పాల్గొనడానికి అర్హులు, రిజిస్ట్రేషన్‌లను సమర్పించడానికి జులై 15 చివరి తేదీ అని పేర్కొంది.

ఐఎంఎఫ్ ఆసియా-పసిఫిక్ చీఫ్‌గా కృష్ణ శ్రీనివాసన్

న్యూదిల్లీ: ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐఎంఎఫ్) ఆసియా, పసిఫిక్ విభాగాధిపతిగా భారతీయ ఆర్థిక వేత్త కృష్ణ శ్రీనివాసన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఐఎంఎఫ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివా ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చి 23న పదవీ విరమణ చేసిన చాంగ్‌యాంగ్ రీ స్థానంలో కృష్ణ శ్రీనివాసన్‌ను నియమించినట్టు తెలిపారు. జూన్ 22న ఆయన కొత్త బాధ్యతలు స్వీకరించనున్నట్టు తెలిపారు. కృష్ణ శ్రీనివాసన్ ఐఎంఎఫ్ సంస్థలో అత్యంత గౌరవనీయమై సభ్యుడని పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆఫ్రికన్, యూరోపియన్ విభాగాలతో పాటు మానిటరీ అండ్ క్యాపిటల్ మార్కెట్, స్ట్రాటజీ సహా అనేక విభాగాలకు నాయకత్వం వహించిన శ్రీనివాసన్ గత 27 ఏళ్లుగా తన శక్తి సామర్థ్యాలను నిరూపించుకున్నారని కొనియాడారు. సంస్థకు విశ్వసనీయ సలహాదారుగా, ఆలోచనా పరుడిగా, వ్యూహకర్తగా మంచి పేరు సంపాదించుకున్నారని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న దేశాలపై దృష్టిని కేంద్రీకరించి పని చేశారని తెలిపారు. ఈ క్రమంలో ఆయన్ను ఆసియా, పసిఫిక్ ఐఎంఎఫ్ విభాగానికి అధిపతిగా నియమించినట్టు చెప్పారు.

పెరుగుతున్న 'కోవిడ్'

కొత్తగా 7,584 కేసుల నమోదు

న్యూదిల్లీ : దేశంలో కోవిడ్-19 మహమ్మారి విజృంభిస్తోంది. గత 24 గంటల్లో 7,584 కొత్త కేసులు నమోదయ్యాయి. దీంతో ఇప్పటి వరకు మొత్తం కేసులు 4,32,05,106కి చేరాయి. క్రియాశీల కేసులు 36,267కి పెరిగినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం తెలిపింది. శుక్రవారం ఉదయం 8 గంటల వరకు అందిన వివరాల ప్రకారం, మహమ్మారితో మరో 24 మందితో మొత్తం మృతుల సంఖ్య 5,24,747కి పెరిగింది. తాజాగా క్రియాశీల కేసులు 3,769కి పెరిగాయి. మొత్తం ఇన్ఫెక్షన్లలో క్రియాశీ కేసులు 0.08 శాతంగా ఉన్నాయి. అయితే జాతీయ కోవిడ్-19 రికవరీ రేటు 98.70 శాతం నమోదయినట్లు ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇక రోజువారీ పాజిటివిటీ రేటు 2.26, వారపు పాజిటివిటీ రేటు 1.50 శాతంగా నమోదయ్యాయి. మహమ్మారి నుంచి ఇప్పటి వరకు 4,26,44,092 మంది కోలుకున్నారు. మరణాల రేటు 1.21 శాతంగా ఉన్నాయి. మరోవైపు, దేశంలో కోవిడ్ టీకా కార్యక్రమం కింద 194.76 కోట్ల టీకాలను పంపిణీ చేశారు.

పెళ్లి తిరస్కరించిన యువతిపై ప్రేమికుడి యాసిడ్ దాడి

బెంగళూరు: పెళ్లి ప్రతిపాదనను తిరస్కరించినందుకు మహిళపై ప్రేమికుడు యాసిడ్ పోశాడు. ఈ ఘటన నగరంలోని సారక్కి ప్రాంతంలో శుక్రవారం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. దీంతో ఆమె కుడి కంటికి గాయమవడంతో తక్షణమే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈమెకు ముగ్గురు పిల్లలు ఉండగా, ఇటీవలే విడాకులు తీసుకుంది. నిందితుడు అహ్మద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరూ అగరబత్తుల ఉత్పత్తులను ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. మూడేళ్లుగా ఒకరికొకరు తెలుసు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అహ్మద్ కొన్ని వారాలుగా మహిళను పెళ్లి చేసుకోవాలని వేధిస్తున్నాడు. అయితే ఆమె అతని విజ్ఞప్తిని పదే పదే తిరస్కరించింది. శుక్రవారం జేపీ నగర్ సమీపంలోని సారక్కి రోడ్డు జంక్షన్ వద్ద ఆమెపై యాసిడ్ పోశాడు. రెండు నెలల క్రితం ఇక్కడ ఓ మహిళపై యాసిడ్ దాడి జరిగిన నేపథ్యంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అనంతరం తమిళనాడుకు చెందిన నిందితుడిని అరెస్టు చేశారు.

దేశానికి కేంద్రం 'ద్రోహం'

- సరిహద్దుల్లో చైనా నిర్మాణాలను విస్మరించింది
- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

న్యూదిల్లీ : సరిహద్దుల్లో చైనా మౌలిక సదుపాయాల కల్పనను విస్మరించి కేంద్ర ప్రభుత్వం దేశానికి ద్రోహం చేస్తోందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం ఆరోపించారు. లడఖ్ సమీపంలో చైనా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం 'ఆందోళనకరం' అని అమెరికా ఉన్నతస్థాయి జనరల్ చార్లెస్ ఎ ఫ్లిన్ పేర్కొన్న తర్వాత రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'చైనా భవిష్యత్తులో శత్రు చర్యకు పునాదులు నిర్మిస్తోంది. దానిని విస్మరించడం ద్వారా ప్రభుత్వం భారతదేశానికి ద్రోహం చేస్తోంది' అని రాహుల్ ట్విటర్‌లో తెలిపారు. ఇదిలాఉండగా, తదుపరి సైనిక చర్చలలో తూర్పు లడఖ్‌లో మిగిలిన సమస్యలకు పరస్పరం ఆమోదయోగ్యమైన పరిష్కారానికి చేరుకోవడానికి చైనా తమతో కలిసి పని చేస్తుందని భావిస్తున్నట్లు భారతదేశం గురువారం తెలిపింది. ఎందుకంటే ప్రస్తుత పరిస్థితిని పొడిగించడం అనేది రెండు వైపులా లేదా మొత్తం సంబంధాలకు ప్రయోజనం కలిగించదు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చీ మాట్లాడుతూ తూర్పు లడఖ్‌లో చైనా మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సరిహద్దు ప్రాంతాలతో పాటు లోతైన ప్రాంతాలలో జరుగుతున్న పరిణామాలను భారతదేశం జాగ్రత్తగా పర్యవేక్షిస్తోందని తెలిపారు. జనరల్ ఫ్లిన్ చెప్పినదానిపై తాను వ్యాఖ్యానించడానికి ఇష్టపడను అని బాగ్చి అన్నారు. లడఖ్‌లో భారత్‌తో సరిహద్దు సమీపంలో చైనా సృష్టిస్తున్న కొన్ని రక్షణ మౌలిక సదుపాయాలు 'ఆందోళన కలిగించేవి' అని జనరల్ ఫ్లిన్ బుధవారం అన్నారు. ఈ అక్రమ నిర్మాణంతో సరిహద్దులో అస్థిర వాతావరణం ఏర్పడుతుందని, రెండు దేశాల సంబంధాలు కూడా దెబ్బ తింటాయని, ఇది చైనా కుటిల ప్రయత్నమని అన్నారు. కాగా లడఖ్‌లో చైనా అతిక్రమణలను రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో పోల్చడం నుంచి దేశాన్ని రక్షించమని ప్రధాని నరేంద్ర మోడీకి చెప్పడం వరకు, రాహుల్ గాంధీ భారతదేశ చైనా విధానాన్ని తీవ్రంగా విమర్శించారు. భారతదేశ భద్రత, ప్రాదేశిక సమగ్రత చర్చలకు సాధ్యం కాదని, తూర్పు లడఖ్‌లోని పాంగోంగ్ త్సోపై చైనా రెండవ వంతెనను నిర్మిస్తున్నట్లు వచ్చిన నివేదికలపై ప్రభుత్వం మౌనంగా ఉండటాన్ని ఆయన ప్రశ్నించారు. 'భవిష్యత్ శత్రు చర్యకు చైనా పునాది నిర్మిస్తోంది, దీనిని విస్మరించి బీజేపీ కేంద్ర ప్రభుత్వం భారతదేశానికి ద్రోహం చేస్తోంది' అని ట్విటర్‌లో పేర్కొన్నారు.

కాలేజీల్లో టూరిజం క్లబ్‌లు

పర్యాటకంపై కేరళ సర్కారు దృష్టి

తిరువనంతపురం: పర్యాటకరంగం అభివృద్ధిపై కేరళ ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించింది. పర్యాటకరంగంలో విద్యార్థులను భాగస్వాములను చేయడంలో భాగంగా రాష్ట్రంలోని ప్రధాన కళాశాలల ఆవరణల్లో 'టూరిజం క్లబ్'లను ఏర్పాటు చేస్తోంది. పర్యాటక, ఉన్నత విద్యామంత్రిత్వశాఖలు ఇందుకు చొరవ తీసుకున్నాయి. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి, కాలేజీల్లో టూరిజం క్లబ్బుల ఏర్పాటు, అందులో విద్యార్థులను భాగస్వాములను చేయడం గురించి పర్యాటకమంత్రి పీఏ మొహమ్మద్ రియాజ్, విద్యాశాఖమంత్రి ఆర్.బిందు మీడియాకు వివరించారు. మొదటి దశలో 25 కాలేజీల్లో టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నామని, క్లబ్‌ల కార్యకలాపాల నిర్వహణ కోసం నిధులను పర్యాటకశాఖ అందిస్తుందని రియాజ్, బిందు తెలిపారు. కాలేజీ క్యాంపస్ క్లబ్‌లు సరికొత్త పర్యాటక ధోరణులకు మార్గం సుగమం చేస్తాయని, విద్యార్థుల సందర్శనకు, కాలేజీలలో టూరిజం క్లబ్‌ల పర్యటనకు ఆసక్తి కలిగిస్తాయని మంత్రి రియాజ్ చెప్పారు.

విద్యార్థులలో భవిష్యత్ టూరిజం ప్రొఫెషనల్స్‌ను గుర్తించాలని యోచిస్తున్నామన్నారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకొని గొప్ప మార్కెట్‌ను తెచ్చిపెడతారని భావిస్తున్నామని పేర్కొన్నారు. సరికొత్త ఆలోచనలు, సృజనాత్మకతకు విద్యార్థులు పెద్దపీట వేస్తారని, పర్యాటకులను టూరిజం క్లబ్‌లకు రప్పించడానికి కృషి చేస్తారని వివరించారు. అంతేకాకుండా విద్యార్థులు పార్ట్‌టైమ్ టూరిజం గైడ్‌లుగానూ పనిచేయవచ్చని, సాంస్కృతిక కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తారని మంత్రి వెల్లడించారు. తమ సొంత నైపుణ్యంతో విదేశీ విశ్వవిద్యాలయాలను సైతం విద్యార్థులు ఆకర్షించే పరిస్థితి ఉంటుందని పర్యాటకమంత్రి తెలిపారు. సరికొత్త పర్యాటక ఉత్పత్తులు గుర్తించేందుకు విద్యార్థులను ప్రోత్సహించడానికి ఈ చొరవ తీసుకుంటున్నామని మంత్రి బిందు చెప్పారు. పర్యాటకరంగం అభివృద్ధిలోనూ విద్యార్థులను భాగస్వాములను చేయడం సంతోషంగా ఉందన్నారు. పర్యాటకరంగం కేరళకు అత్యంత కీలకమన్న విషయాన్ని యువతలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపారు.

నాలుగు అసెంబ్లీ స్థానాలకు 22మంది అభ్యర్థులు

అగర్తల: రాష్ట్రంలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు జరగనున్న ఉప ఎన్నికల కోసం త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా సహా కనీసం 22 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని ఎన్నికల సంఘం అధికారి శుక్రవారం తెలిపారు. బిప్లబ్ కుమార్ దేబ్ స్థానంలో రాజ్యసభ సభ్యుడు సాహా గత నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా నియమితులయ్యారు. అగర్తల, టౌన్ బర్దోవాలి, సుర్మా, జుబారాజ్‌నగర్ అనే నాలుగు అసెంబ్లీ స్థానాలకు జూన్ 23న ఉప ఎన్నికలు జరగనున్నాయి. 'ఉప ఎన్నికల కోసం మాకు 24 నామినేషన్ పత్రాలు అందాయి. నీల్ కమల్ సాహా నామినేషన్ స్క్రూటినీ సమయంలో తిరస్కరించబడింది. అయితే సుర్మా నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థి రేఖా సబర్ తన పత్రాలను గురువారం ఉపసంహరించుకున్నారు'అని ఎన్నికల సంఘం అధికారి తెలిపారు. సాహా టౌన్ బోర్డోవాలి అసెంబ్లీ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా, కాంగ్రెస్ నాయకుడు ఆశిష్ కుమార్ సాహాను నియోజక వర్గంలో నిలబెట్టింది. లెఫ్ట్ ఫ్రంట్ నామినీగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్‌కు చెందిన రఘునాథ్ సర్కార్ ఉన్నారు. అగర్తల స్థానంలో బీజేపీ అభ్యర్థి అశోక్ సిన్హా, లెఫ్ట్ ఫ్రంట్ అభ్యర్థి కృష్ణ మజుందార్‌తో కాంగ్రెస్ అభ్యర్థి, రాష్ట్ర మాజీ మంత్రి సుదీప్ రాయ్ బర్మన్ పోటీ చేస్తున్నారు. ధలై జిల్లాలోని సుర్మా నియోజక వర్గంలో లెఫ్ట్ ఫ్రంట్‌కు చెందిన అంజన్ దాస్, బీజేపీకి చెందిన స్వప్న దాస్ పాల్, రాజ వంశీయుడు ప్రద్యోత్ కిశోర్ దెబ్బర్మ నేతృత్వంలోని ప్రాంతీయ పార్టీ అయిన తిప్రా మోతాకు చెందిన బాబురామ్ సత్నామీ అనే ముగ్గురు అభ్యర్థుల మధ్య పోరు నెలకొంది. తిప్ర మోత నామినీకి కాంగ్రెస్ మద్దతిచ్చింది. సంప్రదాయ వామపక్షాల కంచుకోటగా పరిగణించబడే జుబరాజ్‌నగర్ నియోజకవర్గం, బీజేపీ అభ్యర్థి మలినా దేబ్‌నాథ్, సీపీఐ(ఎం)కి చెందిన శైలేంద్ర చంద్ర నాథ్ మధ్య పోరు సాగుతుంది. ఈశాన్య రాష్ట్రంలో తన అడుగుజాడలను విస్తరించడమే లక్ష్యంగా పెట్టుకున్న తృణమూల్ కాంగ్రెస్ నాలుగు నియోజకవర్గాల్లోనూ తమ అభ్యర్థులను నిలబెట్టింది.

దోడా, కిష్త్వార్‌ల్లో కర్ఫ్యూ... ఇంటర్‌నెట్ సేవలు బంద్

జమ్ము/శ్రీనగర్: మొహమ్మద్ ప్రవక్త పై పార్టీ నుంచి సస్పెండైన ఇద్దరు బీజేపీ నాయకుల వివాదాస్పద వ్యాఖ్యలపై జమ్ములోని దొడా, కిష్త్వార్ ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొనడంతో అధికారులు అక్కడ కర్ఫ్యూ విధించారు. కశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాలు బంద్ పాటించాయని అధికారులు శుక్రవారం తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా భదర్వా, కిష్త్వార్ పట్టణాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. కశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్‌ను కూడా నిలిపివేసినట్లు వారు తెలిపారు. కాశ్మీర్‌లో, శాంతిభద్రతల పరిరక్షణ కోసం శ్రీనగర్‌లోని సున్నితమైన ప్రదేశాలలో, లోయలోని ఇతర ప్రాంతాలలో భద్రతా దళాలను పటిష్టంగా మోహరించారు. పాత నగరం - డౌన్‌టౌన్ శ్రీనగర్‌గా ప్రసిద్ధి చెందింది. రోడ్లపై ప్రజా రవాణాతో పూర్తిగా నిలిచిపోయింది. అయితే, లాల్ చౌక్, బాటమలూ పరిసర ప్రాంతాల్లో కార్యాలయాలు, పాఠశాలలు తెరిచి ఉన్నాయి. పుకార్లను అరికట్టేందుకు ముందుజాగ్రత్త చర్యగా కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్‌ను నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. లోయలో ఇప్పటివరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినట్లు నివేదికలు లేవని అధికారులు పేర్కొన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రవక్త మొహమ్మద్‌పై సస్పెండ్ చేయబడిన బీజేపీ అధికార ప్రతినిధి నూపుర్ శర్మ చేసిన అవమానకరమైన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా గురువారం భదర్వా ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. ఉద్రేకపూరిత ప్రసంగాలకు సంబంధించిన వీడియో క్లిప్‌లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని హెచ్చరించారు. "ముందుజాగ్రత్త చర్యగా దోడా, కిష్త్వార్ రెండు జిల్లాల్లో కర్ఫ్యూ విధించబడింది" అని జమ్ము రీజియన్ డివిజనల్ కమిషనర్ రమేష్ కుమార్‌కి తెలిపారు. పరిస్థితి ప్రశాంతంగా ఉందన్నారు. వదంతులు వ్యాపించే కారణంగా భదర్వా, కిష్త్వార్ పట్టణాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఇప్పుడు సస్పెండ్ చేయబడిన బిజెపి అధికార ప్రతినిధి నుపుర్ శర్మపై విద్వేషపూరిత ప్రసంగాలు మసీదు నుంచి వచ్చినట్లు ఆరోపణలున్నాయి. మరో ఘటనలో, సోషల్ మీడియాలో ఎవరో ఒక అభ్యంతరకరమైన పోస్ట్‌ను అప్‌లోడ్ చేయడం మరింత ఉద్రిక్తతను రేగింది. రెండు కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తూ, ఎవరైనా శాంతిభద్రతలను ఉల్లంఘించినట్లు తేలితే వారిని విడిచిపెట్టబోమని పోలీసులు హెచ్చరించారు.

గిరిజన ప్రాంతాలపై నాటి పాలకుల శీతకన్ను

కాంగ్రెస్‌పై మోదీ విమర్శలు

అహ్మదాబాద్: ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. దేశంలో సుదీర్ఘకాలం అధికారం చెలాయించిన నేతలు గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ఏమాత్రం ఆసక్తి చూపలేదని పరోక్షంగా కాంగ్రెస్‌ను నిందించారు. ఓట్ల కోసం లేదా ఎన్నికల్లో విజయం కోసమో తాము అభివృద్ధి పనులు చేయడం లేదని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు తాము కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. నవసరి జిల్లాలో గిరిజన ప్రాంతం ఖుద్వేల్‌లో రూ.3,050 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా గుజరాత్ గౌరవ్ అభియాన్ ర్యాలీలో మోదీ ప్రసంగించారు. ఇప్పటి వరకు దేశాన్ని కాంగ్రెస్ పార్టీ ఎక్కువ కాలం పనిచేసిందని, అభివృద్ధిని మాత్రం పట్టించుకోలేదని మోదీ విమర్శించారు. గతంలో ప్రచారాలు, వాక్సినేషన్ వంటి కార్యక్రమాలకు గిరిజనులు నివసించే అటవీ ప్రాంతానికి చేరడానికి కొన్ని నెలలు పట్టేదని, ఇప్పుడు పట్టణ ప్రాంతాలతో సమానంగా ప్రభుత్వ పథకాలు అటవీ ప్రాంతానికి చేరుతున్నాయని ఆయన వివరించారు. 'కరోనా వైరస్ కట్టడికి టీకాలు మీకు ఉచితంగా అందాయా లేదా' అని ర్యాలీకి హాజరైన ప్రజలను మోదీ ప్రశ్నించారు. తమకు అందాయని వారు సమాధానం చెప్పారు. గడచిన రెండు దశాబ్దాలలో గుజరాత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందిందని, ఇది రాష్ట్రానికే గర్వకారణమని మోదీ వ్యాఖ్యానించారు.

గడచిన 8 ఏళ్లుగా ఆరోగ్యరంగంపై తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని మోదీ చెప్పారు. అందరికీ ఆరోగ్యం అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. అత్యాధునిక వైద్య సేవలు అందించడంలో భాగంగా పౌష్టికాహారానికి అధిక ప్రాధాన్యత అందిస్తున్నామని వివరించారు. నవసరి పట్టణ సమీపంలో ఏర్పాటు చేసిన ఏఎం నాయక్ హెల్త్ కాంప్లెక్స్, నిరళి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించిన అనంతరం మోదీ ప్రసంగించారు. తాను ముఖ్యమంత్రిగా ఉండగా గుజరాత్‌లో పేదలకు మంచి చేసేందుకు ప్రారంభించిన ఆరోగ్య పథకాలను మోదీ గుర్తుచేశారు. ముఖ్యమంత్రిగా చేసిన అనుభవంతో దేశంలోనూ మంచి ఆరోగ్య కార్యక్రమాలు చేపట్టామని చెప్పుకున్నారు. రెండు లక్షల రూపాయల ఆదాయం లోపు గల పేదలకు వైద్య సేవలు అందించడానికి ముఖ్యమంత్రి అమృతం పథకాన్ని తాను ప్రారంభించానని చెప్పారు. ప్రధానమంత్రి అయిన తర్వాత దేశంలో ఆయుష్మాన్ భారత్ పథకం తీసుకొచ్చానన్నారు. ఈ పథకం కింద ఐదు లక్షల ఆదాయం లోపు గల పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఇప్పటి వరకు 40 లక్షలమంది గుజరాతీయులు, అందులో అత్యధికంగా మహిళలు లబ్ధి పొందారని చెప్పారు.

రాజ్యసభ ఎన్నికలు... కాంగ్రెస్‌కు ఓటేసిన ఎమ్మెల్యేలు

బెంగళూరు: నాలుగు రాష్ట్రాల్లోని 16 రాజ్యసభ స్థానాలకు జరుగుతోన్న ఎన్నికల్లో హోరాహోరీ పోరు నెలకొన్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు తమ ఎమ్మెల్యేలను కాపాడుకుంటూ వచ్చిన కొన్ని పార్టీలకు.. క్రాస్ ఓటింగ్ మింగుడు పడడం లేదు. ఈ క్రమంలో కర్ణాటకకు చెందిన ఓ ఎమ్మెల్యే.. తన సొంత పార్టీ జేడీఎస్‌కు కాకుండా కాంగ్రెస్‌కు ఓటు వేశానని ప్రకటించడం గమనార్హం. ఇలా క్రాస్ ఓటింగ్ జరగడంపై స్పందించిన జేడీఎస్ అధినేత హెచ్‌డీ కుమారస్వామి.. బీజేపీకి కాంగ్రెస్ పార్టీ 'బీ-టీమ్' అంటూ ఆరోపించారు. దేశంలో బీజేపీ ఎదుగుదలకు వీరే కారణమంటూ కాంగ్రెస్ తీరుపై మండిపడ్డారు. 'నేను కాంగ్రెస్‌కు ఓటేశాను. ఎందుకంటే ఆ పార్టీ అంటే నాకు ఇష్టం' అని జేడీఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస గౌడ వెల్లడించారు. అంతేకాకుండా జేడీఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతానన్నారు. ఇలా క్రాస్ ఓటింగ్‌పై సొంతపార్టీ ఎమ్మెల్యే ప్రకటనపై స్పందించిన కుమారస్వామి.. మరో ఎమ్మెల్యే ఎస్ఆర్ శ్రీనివాస్ కూడా జేడీఎస్‌కు ఓటు వేయలేదనే విషయం తెలుసన్నారు. తమలాంటి సెక్యులర్ పార్టీకి మద్దతు ఇవ్వకుండా బీజేపీని మరింత బలోపేతం చేసేలా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. దీంతో రాజ్యసభ ఎన్నికల్లో భాగంగా 32 మంది సభ్యులున్నట్లు చెప్పుకున్న జేడీఎస్ బలం 30కి తగ్గిపోయినట్లయింది. ఇదిలాఉంటే, నాలుగు స్థానాలకు ఎన్నికలు జరుగుతోన్న కర్ణాటకలో ఆరుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. బీజేపీని ఓడించాలంటే తమ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కుమారస్వామి కోరినప్పటికీ.. కాంగ్రెస్ మాత్రం ససేమిరా అన్నట్లు తెలుస్తోంది. మరోవైపు తాము బలపరచిన అభ్యర్థికే ఓటు వేయాలంటూ కాంగ్రెస్ నేత, మాజీ సీఎం సిద్ధరామయ్య జేడీఎస్ ఎమ్మెల్యేలకు లేఖ రాశారనే వార్తలు వినిపించాయి. ఓవైపు కాంగ్రెస్, జేడీఎస్.. మరోవైపు బీజేపీ మధ్య కర్ణాటక రాజ్యసభ స్థానాల్లో తీవ్ర పోరు నెలకొంది.

జైపూర్: రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటు వేసిన తర్వాత, భారతీయ గిరిజన పార్టీ శాసనసభ్యుడు రాజ్‌కుమార్ రోట్ శుక్రవారం తన సొంత పార్టీ అధినేత వేలారామ్ ఘోఘ్రాను లక్ష్యంగా చేసుకుని, సమస్యలను అర్థం చేసుకోవడానికి "వృద్ధుడు" అయ్యాడని విమర్శించారు. బీటీపీ ఎమ్మెల్యే రోట, రాంప్రసాద్ దిండోర్ శుక్రవారం రాజ్యసభ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ఓటు వేశారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనవద్దని తమ పార్టీ ఎమ్మెల్యేలకు విప్ జారీ చేసిన వారి పార్టీ విప్‌కు వ్యతిరేకంగా ఓటు వేయడం చర్చనీయాంశమైంది. "మా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి గురించి చెప్పడానికి ఇష్టపడను. ఆయన ప్రస్తుతం వృద్ధాప్యంలో ఉన్నాడు. అర్థం చేసుకునే పరిస్థితి లేదు. కానీ, మా నిర్ణయం గిరిజనులు, ప్రాంత ప్రజల ప్రయోజనాల కోసమే. దీని ఆధారంగా కాంగ్రెస్ అభ్యర్థులకు అనుకూలంగా ఓటు వేయాలని నిర్ణయించుకున్నాం" అని ఓటు వేసిన అనంతరం రోట్ విలేకరులతో అన్నారు. ఇది సమష్టిగా తీసుకున్న నిర్ణయమని తెలిపారు.

రాజ్యసభ ఎన్నికలు...

రాజస్థాన్‌లో సత్తాచాటిన కాంగ్రెస్

- మూడు సీట్లు కాంగ్రెస్ కైవసం
- మీడియా దిగ్గజం సుభాశ్‌చంద్రకు ఘోరపరాజయం
- కర్ణాటకలో బీజేపీకి 3, కాంగ్రెస్‌కు ఒకటి

న్యూదిల్లీ: రాజస్థాన్, కర్ణాటక, మహారాష్ట్ర, హరియాణా రాష్ట్రాలోని మొత్తం 16 రాజ్యసభ స్థానాలకు శుక్రవారం ఎన్నికలు జరిగాయి. మహారాష్ట్రలో ఆరు స్థానాలకు, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లో నాలుగు చొప్పున; హరియాణాలో రెండు స్థానాలకు పోలింగ్ జరిగింది. ఈ క్రమంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య పోరు హోరాహోరీగా సాగింది. రాజ స్థాన్‌లో కాంగ్రెస్ సత్తాచాటింది. మూడు స్థానాలను ా గెలచుకుంది. బీజేపీ ఒక స్థానానికి పరిమితం అయింది. అలాగే కర్ణాటకలో బీజేపీ మూడు స్థానాలలో గెలవగా కాంగ్రెస్ ఒక స్థానం గెలుచుకున్నది. ఇక హరియాణా, మహారాష్ట్రలో కాంగ్రెస్ అభ్యర్థులు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లు బీజేపీ ఈసీకి ఫిర్యాదుల చేయడంతో కౌంటింగ్ తాత్కాలికంగా నిలిచిపోయింది.

రాజస్థాన్‌లో కాంగ్రెస్‌కు అనుకున్నదానికంటే ఎక్కువ ఓట్లు వచ్చాయి. బీజేపీ క్రాస్‌ఓటింగ్ కలిసివచ్చింది. బీజేపీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన మీడియా దిగ్గజం సుభాశ్ చంద్ర ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ తరపున ప్రమోద్ తివారీ, ముకుల్ వాస్నిక్, రణదీప్ సింగ్ సూర్జేవాలా పోటీ చేసి విజేతలుగా నిలిచారు. బీజేపీ నేత ఘన్‌శామ్ తివారీ గెలిచారు. కాగా, 200 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఓటు వేశారని సీఎం అశోక్ గెహ్లాట్ తెలిపారు. ఈ గెలుపు బీజేపీకి దీటైన బదులు అని వ్యాఖ్యానించారు. అటు కర్ణాటకలో బీజేపీ అభ్యర్థులు ముగ్గురు గెలిచారు. కాంగ్రెస్ ఒక్క స్థానానికే పరిమితం అయింది. బీజేపీ నేతలు నిర్మలా సీతారామన్, జగ్గేశ్, సీటీ రవి విజేతలుగా నిలిచారు. కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ గెలిచారు. అదే సమయంలో సొంత రాష్ట్రంలో జేడీ(ఎస్) ఖాతా తెరవలేదు. ఇద్దరు జేడీఎస్ ఎమ్మెల్యేలు తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయలేదు. జేడీఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయగా అదే పార్టీకి చెందిన గుబ్బీ ఎమ్మెల్యే ఎస్ఆర్ శ్రీనివాస్ శ్వేత బాలెట్ వేశారు. తమకు నచ్చినట్లు చేశామని ఆ ఇద్దరు అనంతరం చెప్పారు. శ్వేత ఓటు చెల్లదని జేడీఎస్ నేత కుమారస్వామి అన్నారు. తోట్ నేతలపై అసహనం వ్యక్తంచేశారు

మహారాష్ట్రలో ఆరు స్థానాల్లో ఏడుగురు పోటీ చేశారు. ఆ రాష్ట్రంలోని మహా వికాస్ అగాధీ ప్రభుత్వానికి ఎంఐఎం మద్దతిచ్చింది. కాంగ్రెస్ అభ్యర్థి ఇమ్రాన్ ప్రతాప్‌గర్హికి ఎంఐఎం ఎమ్మెల్యేలు ఇద్దరు ఓటు వేశారు. బీజేపీని ఓడించే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఏఐఎంఐఎం అధినేత ఒవైసీ వెల్లడించారు. హరియాణాలో కాంగ్రెస్‌కు బీజేపీకి మధ్య పోటీ నెలకొంది. హరియాణా కాంగ్రెస్ నేత కుల్దీప్ బిష్ణోయ్ పార్టీపై తీవ్ర అసహనంతో ఉన్నప్పటికీ తమ అభ్యర్థి అజయ్ మాకెన్‌కు ఓటు వేశారు.

కాగా, మొత్తం 57 స్థానాలకు ఎన్నికలను తొలుత ప్రకటించగా 41 స్థానాల్లో అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో మిగలిన 16 స్థానాలకు శుక్రవారం ఎన్నికలు జరిగాయి.

ఇదిలావుంటే, నిబంధనలను అతిక్రమించారన్న ఆరోపణల నేపథ్యంలో మహారాష్ట్ర, హరియాణా రాష్ట్రాల్లో ఓటింగ్ ఆలస్యమైంది. దీంతో ఓట్ల లెక్కింపు తాత్కాలికంగా నిలిచిపోయింది. కేబినెట్ మంత్రులు జితేంద్ర అవ్హద్ (ఎన్‌సీపీ), యశోమతి ఠాకూర్ (కాంగ్రెస్)తో పాటు శివసేన ఎమ్మెల్యే సుహాస్ ఖాండే ఎన్నికల నిబంధనావళిని ఉల్లంఘించినట్లు బీజేపీ ఆరోపణలు చేసింది. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ఆ నేతలకు వచ్చిన ఓట్లను రద్దు చేయాలని కోరింది. తమ బ్యాలెట్లను పార్టీ ఏజెంట్లకు అవ్హద్, ఠాకూర్ ఇచ్చినట్లు ఆరోపించింది. హరియాణా లోనూ ఇదే తరహా పరిస్థితులతో ఓట్ల లెక్కింపు ఆగింది. ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఓట్లను రద్దు చేయాలని బీజేపీ, ఆ పార్టీ మద్దతిచ్చిన స్వతంత్ర్య అభ్యర్థి కలిసి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కిరణ్ చౌదరి, బీబీ బత్రా తమ బ్యాలెట్లను అనధికారిక వ్యక్తులకు అందజేసినట్లు ఆరోపించారు.

ఫిర్యాదుల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ అనుమతి లేకుండా ఓట్ల లెక్కింపును కొనసాగించలేదని అధికారులు వెల్లడించారు. అనుమతిని కోరుతూ ఈసీకి ఈమెయిల్‌ను పంపారు. ఇదే క్రమంలో న్యూదిల్లీలో ఎన్నికల కమిషన్‌ను కాంగ్రెస్ ఆశ్రయించింది. బీజేపీ కుయుక్తులు ప్రదర్శిస్తూ స్వేచ్ఛగా పాదర్శకంగా జరిగిన ఎన్నికల ప్రక్రియకు తూట్లు పొడవాలని చూస్తోందని ఆరోపించింది. తక్షణమే ఫలితాలను ప్రకటించాలని డిమాండు చేసింది. ఎన్నికల కమిషన్‌ను కలిసిన కాంగ్రెస్ నేతల్లో పవన్ కుమార్ భన్సల్, వివేక్ తంఖా, రంజీత్ రంజన్, అజయ్ మాకెన్ ఉన్నారు. ఈసీకి మెమోరాండాన్ని వారు అందజేశారు.

నవాజ్ మాలిక్‌కు ఓటు నిరాకరణ

రాజ్యసభ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మహారాష్ట్ర మంత్రి నవాజ్ మాలిక్ పెట్టుకున్న పిటిషన్‌ను బాంబే హైకోర్టు తిరస్కరించింది. ఓటు వేసేందుకు వీల్లేదని శిక్ష అనుభవిస్తున్న మాలిక్‌కు తేల్చిచెప్పింది.

బహిరంగ సభలో మాట్లాడుతున్న రామకృష్ణ, వేదికపై ముప్పాళ్ల నాగేశ్వరరావు, నరసింహులు, సుందర్‌లాల్ తదితరులు

కార్పొరేట్లకు మోదీ ఊడిగం

- రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్న జగన్
- ప్రజా సమస్యలపై పోరే అజెండా
- శ్రీకాకుళం బహిరంగ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలను దోచి కార్పొరేట్‌లకు దేశ సంపదను కట్టబెట్టడమే పనిగా పెట్టుకొని కార్పొరేట్‌లకు ఊడిగం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ తీవ్రంగా విమర్శించారు. సీపీఐ శ్రీకాకుళం జిల్లా 24వ మహాసభలు శుక్రవారం ఇక్కడ ప్రారంభమయ్యాయి. సీపీఐ శ్రేణులు రామలక్ష్మణ కూడలి నుంచి జీటీ రోడ్డు మీదుగా ఏడురోడ్ల కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి సనపల నర్సింహులు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో కె. రామకృష్ణ మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చి 8ఏళ్లు అయిందని, ఆయన పాలనలో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఒరిగిందేమిటో చెప్పాలని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని, విదేశాల్లో దాచుకున్న నల్ల ధనాన్ని తీసుకువస్తానని చెప్పి గద్దెనెక్కిన మోదీ అధికారంలోకి వచ్చిన వెంటనే కార్పొరేట్ శక్తులకు తొత్తుగా మారి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, సామాన్యులను దోచి, కార్పొరేట్‌ల ఆర్థిక ఎదుగుదలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుతున్నారని, దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో చెలరేగుతూ దళితుల పట్ల దాడులు అధిక మయ్యాయని అన్నారు. లక్షల కోట్ల విలువల చేసే ప్రభుత్వ రంగ సంస్థలను నష్టాల సాకుతో వేల కోట్లకే అంబానీ, ఆదానీలాంటి కార్పొరేట్‌లకు కట్టబెడుతున్నారని, దేశంలోని అన్ని రంగాలు కార్పొరేట్ కబంధ హస్తాల్లోనే ఉండే విధంగా ఎన్నో చట్టాలను సవరణలు చేసి సామాన్యుల నడ్డివిరిస్తున్నారన్నారు. మోదీ పాలనలో దేశం తిరోగమనం దిశగా పయనిస్తోందని ఆ పాలనకు చరమగీతం పడినప్పుడే దేశం అభివృద్ధి బాటపడుతుందన్నారు. తన తండ్రి ఆశయసాధనకే రాజకీయాల్లోకి వచ్చానని, మాట తప్పను, మడం తిప్పనని చెబుతున్న ముఖ్యమంత్రి ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను పక్కనబెట్టి ప్రతి విషయంలో మాటతప్పుతున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వారంలో సీపీఎస్ రద్దు చేస్తానని చెప్పిన జగన్, మూడేళ్లు గడచినా రద్దు చేయకుండా జీపీఎస్ పేరుతో మరోసారి ఉద్యోగులను మోసం చేయడానికి సిద్ధమయ్యారన్నారు. విభజన హామీలు, ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు పరిశ్రమల కోసం కేంద్రంతో పోరాడకుండా రాష్ట్రానికి అప్పులు కావాలని నిత్యం జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ వెళుతున్నారని చెప్పారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, కొత్తగా ఒక ఎకరాకైనా నీరందించారా? ఒక్క ప్రాజెక్టు అయిన నిర్మించారా అని ప్రశ్నించారు. కమ్యూనిస్టులు నిత్యం ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా పోరాటాలు చేస్తారని, చట్ట సభల్లో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం ఉన్నప్పుడే అందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే సీపీఐ అజెండా అని రామకృష్ణ స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాజన్న రాజ్యం తీసుకువస్తానని చెప్పి జగన్‌మోహన్‌రెడ్డి అధికారం వచ్చాక, తాను అధికారంలోకి రావడానికి కారణమైన బడుగు, బలహీన, అణగారిన వర్గాలకే తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమ పథకాలతోనే గెలుస్తామన్న ధీమాతో వైసీపీ పెద్దలు ఉన్నారని, సంక్షేమం మాత్రమే అభివృద్ధి కాదని, రాష్ట్రం శాస్త్ర, సాంకేతిక, ఐటీ రంగాల్లో అభివృద్ధి చెంది యువతకు ఉద్యోగ కల్పనతోపాటు పెండింగ్ ప్రాజెక్టులను నిర్మించి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసినప్పుడు రాష్ట్రం అభివృద్ధి బాటపడుతుందన్నారు. పాలకులు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ సామాన్య, మధ్యతరగతి బతుకులను మరింత దుర్భంలోకి నెడుతున్నారన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో ఎన్నో భూపోరాటాలు చేసి పేదలకు భూ పంపిణీ చేసిన ఘనత ఉందని సీపీఐ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చాపర సుందర్‌లాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు బలగ శ్రీరామ్మూర్తి, లండ వెంకటరావు, చాపర వెంకటరమణ, చిక్కాల గోవిందరావు, పట్టా ప్రభా వతి, లక్కోజి శ్రీనివాసరావు, ఎం. యుగంధర్, ఎస్. నారాయణస్వామి, జి. రాజేశ్వరరావు, ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు, డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు యడ్ల గోపి, సీపీఐ నగర కార్యదర్శి డోల శంకరరావు, సీపీఐ నగర సహాయ కార్యదర్శి కొమర భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ శ్రేణులు

'పాన్' సినిమాలకు వందల కోట్లు ఎందుకు? తమ్మారెడ్డి

హైదరాబాద్: 'పాన్ ఇండియా చిత్రాలకు రూ.వందల కోట్లు ఎందుకు ఖర్చు అవుతున్నాయి..? అని సీనియర్ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ప్రశ్నించారు. అడివి శేష్ ప్రధాన పాత్రలో నటించిన 'మేజర్'ని చూసిన ఆయన తాజాగా ఆ సినిమాపై ప్రశంసల వర్షం కురిపించారు. 'నేను 'మేజర్' సినిమా చూశా. సినిమా చాలా బాగా తీశారు. నటీనటులందరూ చక్కగా నటించారు. నిర్మాణ విలువలు బాగున్నాయి. చిత్రబృందం మొత్తానికి నా అభినందనలు. ఈ మధ్య మనం ఎక్కువగా పాన్ ఇండియా ప్రాజెక్ట్, పాన్ ఇండియా సినిమా అని చెబుతున్నాం. నిజంగా చెప్పాలంటే.. 'మేజర్' పాన్ ఇండియా కథ. 'మాది పాన్ ఇండియా ప్రాజెక్ట్.. బడ్జెట్ భారీగా అయ్యింది, లాస్‌లు వస్తున్నాయి'.. కాబట్టి మేము సినిమా టికెట్ రేట్లు పెంచుకునేలా వెసులుబాటు కల్పించండంటూ ముఖ్యమంత్రులను కోరడం ఈ మధ్య కాలంలో ఎక్కువగా చూస్తున్నాం. అలాంటి ఎన్నో పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లకు 'మేజర్' ఏమాత్రం తీసిపోదు. టెక్నికల్, క్వాలిటీపరంగా సినిమా బాగుంది. ఈ చిత్రాన్ని రూ.25కోట్లలోపే పూర్తి చేస్తే.. మిగతా ప్రాజెక్ట్‌లకు ఎందుకు వందల కోట్లు ఖర్చు చేస్తున్నారు. 'మేజర్' లాంటి చిత్రానికి ఖర్చు కానిది.. మీకు ఎందుకు అవుతుంది? అనేది ఆలోచించుకోవాలి. షూటింగ్ అని చెప్పి క్యారవాన్‌లో కూర్చుంటున్నారా..? సినిమా చేస్తే ప్యాషన్‌తో చేయాలి. సమయాన్ని వృథా చేసుకోకుండా చూసుకోవాలి" అని తమ్మారెడ్డి వ్యాఖ్యానించారు.

ఎస్సీ హాస్టళ్లలో ఫలితాల మెరుగుకు చర్యలు: మేరుగు నాగార్జున

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఎస్సీ హాస్టళ్లలో తొమ్మిదో తరగతి విద్యార్థులకు రెండు నెలల ముందు నుంచే 10వ తరగతి పాఠ్యాంశాలపై అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అధికారులను ఆదేశించారు. ఎస్సీ హాస్టళ్లలో ఈ ఏడాది పదవ తరగతిలో 49 శాతం మంది విద్యార్థులే ఉత్తీర్ణులైన నేపథ్యంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో శుక్రవారం తన ఛాంబర్‌లో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలలో అతి తక్కువ శాతం ఫలితాలు వచ్చిన చోట ప్రిన్సిపాల్స్ పై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ హాస్టళ్లలో వచ్చిన పదవ తరగతి ఫలితాల పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు.

అథ్లెటిక్స్ నుంచి నమూనాలు సేకరించనున్న నాడా

చెన్నై: జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) ప్రస్తుతం జరుగుతున్న జాతీయ అంతర్-రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లలో పతకాలు సాధించిన వారందరి నుంచి పరీక్షల కోసం నమూనాలను సేకరిస్తుంది. ఛాంపియన్‌షిప్‌లలో 43 పతక ఈవెంట్‌లు ఉన్నాయి, అయితే ఒకటి కంటే ఎక్కువ పతకాలను గెలుచుకున్న క్రీడాకారులు ఉండవచ్చు. ప్రతి ఈవెంట్‌లో బంగారు, రజతం, కాంస్య విజేతలు ఉంటారు. ఈ ఈవెంట్‌లలో పాల్గొనే పురుషుల, మహిళల నమూనాలను తీసుకుంటాం'అని డోప్ పరీక్ష బృందం సభ్యుడు తెలిపారు. జులై28 నుంచి ఆగస్టు 8 వరకు బర్మింగ్‌హామ్‌లో జరిగే కామన్వెల్త్ గేమ్స్ కోసం ఎంపిక ట్రయల్‌గా ఉపయోగపడే ఈవెంట్ ప్రారంభానికి ఒక రోజు ముందు బెంగళూరు నుంచి నాడా డోప్ టెస్టింగ్ బృందం గురువారం చెన్నైకు వచ్చింది.

ఒడిశా చేరుకున్న భారత్-సౌతాఫ్రికా జట్లు

భువనేశ్వర్: అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య భారత్-సౌతాఫ్రికా జట్టు శుక్రవారం మధ్యాహ్నం ఒడిశా చేరుకున్నాయి. ఈ రెండు జట్ల మధ్య జూన్12న రెండో టీ20 జరగనున్నది. రెండు జట్లు బిజు పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకోగా, అప్పటికే అక్కడకు చేరుకున్న క్రికెట్ అభిమానులు వారికి స్వాగతం పలికారు. అనంతరం విమానాశ్రయంలో ఒడిశా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పుష్ప గుచ్ఛాలు అందజేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు కట్టుదిట్టమైన భద్రత మధ్య హోటల్‌కు చేరుకున్నారు. ఆదివారం మ్యాచ్‌ను దృష్టిలో పెట్టుకు డీజీపీ ఎస్‌కే భన్సాల్, ఇతర సీనియర్ అధికారులు, పోలీసులు, జిల్లా అధికారులు కటక్‌లోని బారాబతి స్టేడియంను తనిఖీ చేశారు.

వెంటిలేటర్‌పై ముషారఫ్

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్ ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. కండరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన మూడు వారాలుగా దుబాయిలోని అమెరికన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో ఆయనను వెంటిలేటర్‌పై ఉంచారు. కోలుకునే పరిస్థితి లేదని వైద్యులు వెల్లడించినట్లు కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. ముషారఫ్ మృతి చెందినట్లు వార్తలు వస్తుండటంపై స్పందించారు. 'ముషారఫ్ ఆరోగ్య పరిస్థితి క్లిష్టంగా ఉంది. అవయవాలు పనిచేయడం లేదని డాక్టర్లు తెలిపారు. ఆయన కోసం ప్రార్థించండి' అని ట్విట్టర్ మాధ్యమంగా కుటుంబసభ్యులు విజ్ఞప్తి చేశారు. ముషారఫ్ (78)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ముషారఫ్ 1943, ఆగస్టు 11న ముషారఫ్ దిల్లీలో జన్మించారు. విభజన తర్వాత ఆయన కుటుంబం పాకిస్తాన్‌కు వెళ్లి అక్కడే స్థిరపడింది. చిన్నతనం నుంచి చురుగ్గా ఉండే ముషారఫ్ అంచెలంచెలుగా ఎదిగారు. పాక్ ఆర్మీచీఫ్ అయ్యారు. 1999లో నవాజ్ షరీఫ్ ప్రభుత్వంపై సైనిక తిరుగుబాటు క్రమంలో పాకిస్తాన్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. 2001 నుంచి 2008 వరకు ఆ పదవిలో కొనసాగారు. 2008లో అభిశంసనను తప్పించుకొనేందుకు అధ్యక్షుడిగా రాజీనామా చేశారు. ఈయనపై పాక్ మాజీ ప్రధాని బెనజీర్ భుట్టో హత్య ఆరోపణలు ఉన్నాయి. ముషారఫ్ కుటుంబం 2016లో దుబాయికి తరలిపోయింది. ఇదిలావుంటే, 1999లో కార్గిల్ యుద్ధానికి పర్వేజ్ ముషారఫ్ ప్రధాన కారకుడని, నాటి పాక్ అధ్యక్షుడు నవాజ్ షరీఫ్‌కు తప్పుడు నివేదికలిచ్చి భారత్‌పై యుద్ధానికి ఉసిగొల్పారని విశ్లేషకులు అంటారు. ఈ యుద్ధం నాటి భారత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, పాక్ ప్రధాని షరీఫ్ మధ్య ఒప్పందం 'లాహోర్ డిక్లరేషన్'తో ముగిసిన విషయం విదితమే.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

మూడు పంటలకు సాగునీరు

కృష్ణా డెల్టాకు నీరు విడుదల చేసిన మంత్రి అంబటి

విశాలాంధ్ర-విజయవాడ: ఎన్నడూ లేని విధంగా రైతుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి సాగునీటిని ముందుగానే విడుదల చేయడంతోపాటు చిట్టచివరి భూములకు నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఖరీఫ్ సాగుకు ప్రకాశం బ్యారేజీ నుంచి మంత్రులు జోగి రమేష్, మేరుగ నాగార్జునతో కలిసి సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ, రాష్ట్రంలోని జలాశయాలలో పుష్కలంగా నీరు అందుబాటులో ఉండడంతో రైతాంగానికి నెల రోజులు ముందుగానే సాగునీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ముందుగా సాగునీరు విడుదల చేయడం వల్ల వ్యవసాయ పనులు త్వరగా ప్రారంభించి నవంబరు, డిసెంబరులో సంభవించే తుఫానుల ప్రభావం నుంచి పంటలను రక్షించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. రెండు పంటలు పండించే రైతులకు ముందుగానే సాగునీరు అందిస్తే మూడో పంటను కూడా పండించి ఆర్థికంగా లబ్ధి పొందుతారని అంబటి పేర్కొన్నారు. విత్తనం నుంచి పంట విక్రయం వరకు రైతన్నకు అవసరమైన సేవలను అందించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జోగి రమేష్ మాట్లాడుతూ, తమది రైతు ప్రభుత్వమని, రైతును రారాజు చేయాలనే సకల్పంతో ముందుకు వెళుతున్నామన్నారు. మూడో పంటగా అపరాలు పండించుకునేందుకు రైతులకు అవకాశం ఉందన్నారు. మేరుగ నాగార్జున మాట్లాడుతూ, ముందుగా నీటిని విడుదల చేయడం రైతులకు ఎంతో ఉపయోగమన్నారు. వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, శాసనసభ్యులు మల్లాది విష్ణువర్ధన్, సింహాద్రి రమేష్‌బాబు, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ నారాయణరెడ్డి, ఎస్ఈ తిరుమలరావు, ఈఈ గోపాల్, డీఈ కేవీఎస్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు

- కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్‌పవార్
- పీహెచ్‌సీ, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిశీలన
- ఆరోగ్యశ్రీ కార్డుపై మోదీ ఫొటో లేకపోవడంపై అసంతృప్తి

విశాలాంధ్ర-విజయవాడ : పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య, ఆరోగ్య రంగం ద్వారా అందజేస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్‌పవార్ అన్నారు. కేంద్ర మంత్రి శుక్రవారం ఎన్టీఆర్ జిల్లాలో పర్యటించారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిని, జి.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, కవులూరులో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలించారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రి, సిద్ధార్థ వైద్య కళాశాలలోని టెలీ మెడిసిన్ హబ్‌ను పరిశీలించి ఈ-హాస్పిటల్ అమలును పర్యవేక్షించారు. వైద్య విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలు, ఆయుష్మాన్ భారత్ పథకం అమలు, కోవిడ్ సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ కార్డుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటో లేకుండా సీఎం వైఎస్ జగన్ ఫొటో మాత్రమే ఉండటంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. కవులూరులోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్య సేవలు పొందుతున్న మహిళలతో ఆమె ముఖాముఖి మాట్లాడారు. వైద్య సదుపాయాలు, మందుల సరఫరాను అడిగి తెలుసుకున్నారు. క్లినిక్‌లలో డిజిటల్ రిజిస్టర్లను పరిశీలించారు. బాలింతలతో మాట్లాడి తల్లిబిడ్డలకు అందిస్తున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. పుట్టిన బిడ్డకు ఎప్పటికప్పుడు సకాలంలో వ్యాధినిరోధిక టీకాలను వేయించాలన్నారు. జి.కొండూరు పీహెచ్‌సీలో ఆరోగ్యమిత్రల పనితీరు పరిశీలించి ఆరోగ్యశ్రీ ద్వారా రోగులకు తక్షణమే వైద్య సహాయం అందించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన జీవనాన్ని పొందాలని ఆమె సూచించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, డీఆర్‌వో కె.మోహన్‌కుమార్, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, వైద్యులు కేంద్రమంత్రి వెంట ఉన్నారు. విజయవాడ జీజీహెచ్ పర్యటనలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, జి.కొండూరులో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నీట్-పీజీ ప్రత్యేక కౌన్సెలింగ్‌కు సుప్రీం నో

ప్రభుత్వ నిర్ణయానికి సమర్థన

సీట్ల భర్తీపై పిటిషన్లు కొట్టివేత

న్యూదిల్లీ : నీట్‌పీజీ-2021లో ఆలిండియా కోటాకు సంబంధించి ప్రత్యేక స్ట్రేరౌండ్ కౌనెల్సింగ్ నిర్వహించడం కుదరదని సుప్రీంకోర్టు శుక్రవారం తెలిపింది. ఈ మేరకు కేంద్రప్రభుత్వం, వైద్య మండలి కమిటీ (ఎంసీసీ) తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించింది. 1,456 సీట్ల భర్తీని కోరుతూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. ప్రజా రోగ్యాన్ని ప్రభావితం చేసేలా వైద్యవిద్య నాణ్యతపై రాజీ ప్రసక్తే లేదని జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ అనురుద్దా బోస్ వెకేషన్ బెంచ్ స్పష్టంచేసింది. ప్రత్యేక స్ట్రే రౌండ్ కౌనెల్సింగ్ నిర్వహించరాదని కేంద్రం, ఎంసీసీ తీసుకున్న నిర్ణయం వైద్యవిద్య ప్రయోజనాలతో పాటు ప్రజా రోగ్యానికి హితమైనదిగా తెలిపింది. ఇది అనాలోచిత నిర్ణయం కాదని, ఏకపక్షమైనదిగా పరిగణించలేమని పేర్కొంది. అకడమిక్ సెషన్ మొదలైన ఏడాది తర్వాత; ఎనిమిది -తొమ్మిది రౌండ్ల కౌనెల్సింగ్ జరిగిపోయిక వచ్చి నాన్ క్లీనికల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.. అవి మాకివ్వండి అని విద్యార్థులు కోరడం సరైనది కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి ఖాళీలను భర్తీ చేయలేమని ఇంతకుముందు సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేయడం విదితమే.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.